ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 17.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 237 పేజీలు:11 వెల రూ. 5/-

@prathipaksham | prathipaksham tv telugu



సౌతాఫ్రికా చేతిలో టీమిండియా ఓటమి 11



రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఎమ్మెల్యేలు పార్టీ వదిలే ప్రధాన కారణాలు ఇవే: పార్టీ అంతర్గత అసంతృప్తి: భిన్న వర్గాల మధ్య వర్గపర విభజన, నాయకత్వంపై అసంతృప్తి. అభివృద్ధి నిధుల కేటాయింపు సమస్యలు: స్థానిక పనులకు నిధులు సమయానికి లేకపోవడం. భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై అనిశ్చితి: వచ్చే ఎన్నికలలోనే ప్రాధాన్యతలు, స్థానం కేటాయింపులు, రాజకీయ ప్రాధాన్యతల విషయంలో స్పష్టత లేకపోవడం. ఢిల్లీ పర్యటనల ప్రభావం: రాజధానిలో జరిగిన చర్చలు ఈ పరిణామాలకు మరింత ఊతం ఇచ్చినట్లుగా తెలుస్తోంది.

స్టేట్‌లో జంప్ స్టంట్!!

తెలంగాణలో రాజకీయ తుఫాన్

మరో 10 మంది గులాబీ ఎమ్మెల్యేలు జంప్?

- పాతవారిపై స్పీకర్ నిర్ణయమే కీలకం
- రాష్ట్ర రాజకీయాలలో తీవ్ర ప్రభావం
- జూబ్లీహిల్స్ ఎఫెక్ట్ తో జంప్ సైరన్
- గులాబీ పార్టీలో అసహనంగా మారిన అసంతృప్తి
- బీఆర్ఎస్ మీద పట్టు కోల్పోతున్న అధినేత కేసీఆర్!
- సమన్వయం చేయలేకపోతున్న కీలక నేతలు
- అందుకే పలువురు ఎమ్మెల్యేల పక్క చూపులు
- మరి కొద్ది రోజులలోనే మారనున్న రాజకీయాలు
- ఇప్పుడంతా తుఫాను ముందటి ప్రశాంతతేనా?!

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

నవంబర్ 16: తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో మళ్లీ పెద్ద పలుమార్పులు చోటుచేసుకోవడానికి అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికే 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారిన నేపథ్యంలో, మరొక 10 మంది ఎమ్మెల్యేలు త్వరలో జంప్ చేయవచ్చని రాజకీయవర్గాలలో చర్చ జరుగుతోంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాలలో కొత్త తుఫాన్‌కు దారితీస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు. వచ్చే కొన్ని రోజులలో ఈ ఎమ్మెల్యేలు తీసుకునే నిర్ణయం రాజకీయ రంగం, పార్టీలు, అభివృద్ధి ప్రణాళికలపై కొత్త ప్రభావాలను కలిగించబోతోందని అంటున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికలలో అధికార కాంగ్రెస్ విజయం సాధించడం, బీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోవడం లాంటి తాజా పరిణామాలతో తెలంగాణ లో ఒక్క సారిగా రాజకీయాలు వేడెక్కాయి. గులాబీ కారులో ఉన్న

..:: మిగతా 2లో

ఆర్ఎఫ్సీ నాలుగో అద్భుతం

చార్మినార్, గోల్కొండ, హైటెక్ సిటీ

నగరానికి గుర్తింపు తెచ్చిన ఫిలింసిటీ



- టాలీవుడ్ ఎదుగుదలకు ఎంతో దోహదం
- పత్రికా రంగంలో రామోజీ తిరుగులేని ముద్ర
- విలువలు, సంప్రదాయాలను పాటించారు
- నిపుణులకు అవార్డులు ఇవ్వడం అభినందనీయం
- తెలుగు భాష అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం
- పాలనా వ్యవహారాలను తెలుగులోనే జరుపుతాం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- ఘనంగా రామోజీ ఎక్స్ లెన్స్ అవార్డుల ప్రదానం

..:: 2లో

పత్తి కొనుగోలులో

పాలకుల నిర్లక్ష్యం



- రాష్ట్రంలో పత్తి రైతులు సంక్షోభంలో ఉన్నారు
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉన్నాయి
- కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- కుంటి సాకులతో కొనుగోలుకు సీసీఐ నిరాకరణ
- ప్రభుత్వాల వైఖరితో పత్తి రైతులకు భారీ నష్టం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం


ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 16: రాష్ట్రంలోని పత్తి రైతులు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి దిక్కులేని పరిస్థితి నెలకొనడంపై

..:: మిగతా 2లో

తెరుచుకున్న శబరిమల ఆలయం





- ఆచార వ్యవహారాలతో ప్రత్యేక పూజలు
- నేటి నుంచి సంప్రదాయబద్ధంగా దర్శనాలు
- ఆన్ లైన్ లో రోజూ 70 వేల మందికి అనుమతి
- దేవాలయ క్యూ లైన్లలో ఆధునిక సౌకర్యాలు
- 41 రోజులు కొనసాగనున్న 'మండల -మకర విళక్కు'


ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

శబరిమల (కేరళ), నవంబర్ 16: శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారం తెరుచుకుంది. సాయంత్రం ఐదు గంటలకు ప్రధాన అర్చకుడు కందరారు మహేశ్ సమక్షంలో ఆలయ తలుపులను తెరిచారు. ఈ నేపథ్యంలో భక్తుల భద్రత, సౌకర్యాల కోసం బోర్డు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ ప్రధాన పూజారి అరుణ్ కుమార్ నంబూద్రి ప్రారంభ పూజ నిర్వహించారు. తర్వాత గర్భగుడి నుంచి తీసుకువచ్చిన జ్వాలతో

..:: మిగతా 2లో



అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు



పురాతన శ్రీ రాముడి ఆలయం

యాంజాల్ దేవదాయ భూములలో అక్రమాలు?!

- పట్టించుకోని అధికారులు, మున్సిపల్ కమిషనర్
- నిర్మాణాలను ఆపాలంటున్న పట్టణ ప్రజలు
- కాసులు కురిపించి షెడ్డు నిర్మిస్తున్న నిర్వాహకులు
- మున్సిపల్ ప్రత్యేకధికారి, కలెక్టర్ దృష్టి సారించాలి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్

నవంబర్ 16: దేవాదాయ శాఖ భూములకు రక్షణ లేకుండా పోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మేడ్చల్ జిల్లా తూంకుంట మునిసిపాలిటీ పరిధి దేవరయాంజాల్ లో శ్రీరాముడి భూములకు రక్షణ లేకుండా పోయింది. ఇక్కడ పురాతన శ్రీరాముడి దేవాలయం ఉంది. దానికి సంబంధించి సుమారు 1521 ఎకరాల భూమి దేవాదాయ శాఖ అదీనంలో ఉంది. ఈ భూమి కోర్టు వివాదంలో ఉంది. అయినా, ఇక్కడ విచ్చలవిడిగా గోదాంలు, ఇతర అక్రమ కట్టడాలు వెలిసాయి. గతంలో శామీర్ పేట గ్రామపంచాయతీ కింద ఉండడంతో అప్పుడున్న సర్పంచ్, పంచాయతీ సెక్రటరీ హయాంలో ఇంటి నెంబర్లు తీసుకున్నారు. 2023 నుండి దేవర్ యాంజాల్ తూంకుంట మున్సిపాలిటీ అధీనంలోకి వెళ్ళింది. అప్పటి నుంచి 3 ఈ భూములలో అక్రమ కట్టడాలు మరింత వేగంగా సాగాయి. ప్రభుత్వ భూములను రక్షించే అధికారులే అక్రమ కట్టడాలకు సహకరించి వాటికి ఇంటి నంబర్లు ఎలా ఇస్తారని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోర్టు వివాదంలో ఉన్న భూమిలో అక్రమ షెడ్డు నిర్మించారని ఆరోపిస్తున్నారు. కోట్ల విలువున్న దేవాలయ శాఖ భూములు అక్రమణలకు గురైతే అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కోర్టు కేసులు కొనసాగుతుండగా ఈ విధంగా ఇంటి నెంబర్లు ఇచ్చే అనుమతులు జారీ చేసే హక్కు కమిషనర్ కు ఎక్కడినుండి వచ్చిందో అనే అంశంపై అధికారులు సమాధానం ఇవ్వాలని

..:: మిగతా 2లో

నేడు కేబినెట్ భేటీ



- బీసీలకు 42 శాతం కోటాపై చర్చ
- డిసెంబర్ రెండో వారంలో విజయోత్సవాలు
- ఆ తరువాతే 'స్థానిక' ఎన్నికల షెడ్యూల్ విడుదల!
- మంత్రివర్గంలో కీలకంగా చర్చించే అవకాశం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 16: తెలంగాణ కేబినెట్ సోమవారం పగలు మూడు గంటలకు భేటీ కానుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. బీసీ రిజర్వేషన్ అమలు, హైకోర్టు తీర్పు మీద చర్చించే అవకాశం కూడా ఉందని తెలిసింది. కోర్టు తీర్పుల కారణంగా బీసీలకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రభుత్వపరంగా అమలు చేయటం ఇబ్బందికరంగా మారింది. దీంతో పార్టీపరంగా 42 శాతం వాటా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, మంత్రివర్గంలో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని భావించారు. మంత్రుల అభిప్రాయాలు, న్యాయ నిపుణుల సలహాలను తీసుకోనున్నారు. హైకోర్టు స్టే కారణంగా నవంబర్‌లో జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఈ డిసెంబర్ ఏడు నాటికి రెండేండ్లు పూర్తి అవుతుంది. డిసెంబర్ రెండో వారంలో ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించారు. ఉత్సవాల తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. డిసెంబర్ 8,9వ తేదీలలో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025ను నిర్వహించనుంది. వీటన్నింటి మీద కేబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. గిగ్ వర్కర్ల ముసాయిదాపై కూడా కేబినెట్‌లో చర్చించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం జూబ్లీహిల్స్ గెలుపుతో మంచి జోష్‌లో ఉన్న కాంగ్రెస్ పార్టీ. ఇక ఆలస్యం చేయకుండా స్థానిక ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.



లాలూ ప్రసాద్ పై మండిపడిన కూతురు రోహిణి

బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణీ ఆచార్య సంచలన విమర్శలు చేశారు. తనను తన కుటుంబ సభ్యులే అవమానించారని, బెదిరించారని, చెప్పుతో దాడి చేయడానికి యత్నించారని ఆరోపించారు.

10



ఎర్రకోట పేలుడు కేసులో మరో డాక్టర్ అరెస్టు

ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుడు కేసులో హర్యానాకు చెందిన వైద్యురాలు ప్రియాంక శర్మను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె జమ్మూ కశ్మీర్‌లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్నారు.

10



మహిళలకిచ్చినవి ప్రపంచ బ్యాంకు నిధులు

బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో గెలవడానికి రూ.14 వేల కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులను కేంద్ర సర్కారు దుర్వినియోగం చేసిందని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్, అధికార ప్రతినిధి పవన్ వర్మ ఆరోపించారు.

10



ఛత్తీస్ గఢ్ అడవులలో మరో ఎన్ కౌంటర్

మావోయిస్టుల ఏరివేతను భద్రతాదళాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నాయి. సుక్మా జిల్లాలో ఆదివారం నాడు జరిగిన ఎదురుకాల్పులలో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు.

10

రాజకీయం

తెరుచుకున్న శబరిమల ఆలయం

మొదటిపేజీ తరువాయి

18 మెట్ల వద్ద పవిత్ర మంటను వెలిగించారు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు అధికారికంగా కొత్త పూజారులు ఆచారబద్ధంగా తిరిగి తలుపులు తెరుస్తారు. ఈ వెను వెంటనే తీర్థయాత్ర దర్శనాలు మొదలవుతాయి. అయితే, ఈసారి మండల మకర విళక్కు తీర్థయాత్ర కు సంబంధించి ఏర్పాట్లను ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు కొత్తగా నియమించిన కమిటీ పర్యవేక్షిస్తోంది. ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కె. జయకుమార్ దీనికి అధ్యక్షుడిగా, మాజీ మంత్రి కె.రాజు సభ్యుడిగా ఉన్నారు. శబరిమలలో బంగారు తాపడం వివాదం నేపథ్యంలో వీరు కొత్తగా బాధ్యతలు స్వీకరించారు.

కాగా, భక్తులు ప్రతి రోజూ 70 వేల మంది ఆన్‌లైన్‌టికెట్లను బుక్ చేసుకుని అయ్యప్పను దర్శించుకోవచ్చు. పంబ, నీలక్కల్, ఎరుమేలి, వండిపెరియార్ సత్రం, చెంగన్నూర్ లలో స్పాట్ బుకింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. టికెట్లను sabarimalaonline.org వెబ్‌సైట్ నుంచి బుక్ చేసుకోవచ్చు. అయ్యప్ప దర్శనం కోసం క్యూలో వేచి ఉండే భక్తులకు బిస్కెట్లు, తాగునీరు వంటి వసతులను కల్పించారు. చిన్నారులు, మహిళల కోసం ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. సన్నిధానంలో వైద్య సేవలు, 24 గంటల ఉచిత ఫిజియోథెరపీ సేవలు ఉంటాయి. 41రోజుల పాటు జరిగే మండల పూజ డిసెంబర్ 27న ముగుస్తుంది. అదే రోజు రాత్రి 10 గంటలకు ఆలయాన్ని మూసేస్తారు. మళ్లీ డిసెంబర్ 30న మకరవిలక్కు కోసం ఆలయాన్ని తెరుస్తారు. 2026 జనవరి 14న మకర జ్యోతి దర్శనం తరువాత అదే నెల 20న ఆలయాన్ని మూసేస్తారు.

పత్తి కొనుగోలులో పాలకుల నిర్లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ సంక్షోభానికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యమేనని కేటీఆర్ మండిపడ్డారు. ఈ రెండు ప్రభుత్వాల నిర్లక్ష్యం పత్తి రైతులకు శాపంగా మారిందని పేర్కొన్నారు. దాదాపు 50 లక్షల ఎకరాల పత్తి పంట పండించిన రైతన్నలు తీవ్ర ఇబ్బందులలో ఉంటే ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉన్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, ఎంపీలు ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావాలన్నారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా చొరవ చూపించి కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా సీసీఐతో చర్చించి రైతన్నల సమస్యలను తీర్చాలని డిమాండ్ చేశారు. అడ్డగోలు నిబంధనలతో, కుంటి సాకులతో కొనుగోలు ఆపివేసిన సీసీఐ వైఖరిని కేటీఆర్ తీవ్రంగా ఎండగట్టారు.

కనీస మద్దతు ధర కూడా దొరకడం లేదని

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో రైతన్నకు కనీస మద్దతు ధర కూడా దొరకడం లేదని, తీవ్ర వర్షాల వలన ఇప్పటికే పంట నష్టం వలన ఇబ్బంది పడుతున్న రైతన్నలు మిగిలిన పంటను కూడా అమ్ముకోలేక నష్టాల పాలవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు 50 లక్షల ఎకరాలలో పత్తి పండిస్తున్న రైతన్నలను ఈ పాలకులు పట్టించుకోకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని ఎండగట్టారు. పత్తి కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 60 సార్లు ఢిల్లీకి వెళ్లినా, రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎవరూ కూడా తెలంగాణ పత్తి రైతుల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లలేదని అన్నారు. ప్రస్తుతం పత్తికి క్వింటాల్‌కు రూ. 8,110 కనీస మద్దతు ధర ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో రైతులు రూ. 6,000 నుండి రూ. 7,000 రూపాయలు మాత్రమే రైతులకు దక్కడం అత్యంత కష్టంగా మారిందన్నారు. దీనివల్ల ప్రతి క్వింటాల్‌పై రైతులు దాదాపు రూ. 2,000 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

1.12 లక్షల టన్నుల పత్తి మాత్రమే కొనుగోలు

నెల రోజులలో సీసీఐ 1.12 లక్షల టన్నుల పత్తిని మాత్రమే కొనుగోలు చేసిందని, ఈ సీజన్‌లో అంచనా వేసిన 28.29 లక్షల టన్నుల ఉత్పత్తితో పోలిస్తే ఇది అత్యంత తక్కువ అని కేటీఆర్ ఎత్తి చూపారు. కేవలం రాజకీయాలపైనే దృష్టి సారించకుండా, రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోలు సంక్షోభం మీద ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 325 జిన్నింగ్ మిల్లులకు గాను 256 మిల్లులు మాత్రమే ఓపెన్ చేసి, మిగిలిన వాటిని తెరవకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వాల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మరోవైపు రైతులు తమ పత్తిని అమ్ముకునేందుకు కపస్ మొబైల్ యాప్ కచ్చితంగా వినియోగించాలన్న నిబంధన సడలించాలని, రైతులు పత్తి ఎప్పుడు తీసుకువస్తే అప్పుడు కొనుగోలు చేసే అవకాశం ఇవ్వాలి అన్నారు. రాష్ట్రంలోని పత్తి రైతన్నల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి ఒక ప్రతినిధి బృందాన్ని పంపించి కేంద్రం పైన ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు. గతంలో ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్రం మొండికి వేసినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారితో పాటు మంత్రుల బృందం ఈ అంశంలో ప్రత్యేకంగా చొరవ చూపిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు.



తెలంగాణను స్పోర్ట్స్ హబ్ గా మార్చేందుకు కృషి

- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్
- ముగిసిన'కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోఖాన్ ఇండియా పోటీలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16 : 'కరాటే ఫెడరేషన్ ఆఫ్ షోటోఖాన్ ఇండియా' ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఓపెన్ ఛాంపియన్షిప్-2025 ప్రెసిడెంట్ కప్ ముగింపు వేడుకలు ఆదివారం నాడు సరూర్ నగర్ స్టేడియంలో జరిగాయి. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెచ్ఎఫ్ఎస్ ప్రెసిడెంట్ గడియారం గణేశ్, పి.రామకృష్ణ రావ్, ఎన్.శ్రీనివాస్ రెడ్డి,శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణను స్పోర్ట్స్ హబ్ గా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. కరాటే ఛాంపియన్షిప్ పోటీలు ఎక్కడ నిర్వహించిన ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కరాటే మన జీవితంలో ఒక భాగంగా మారిందన్నారు. తాము ఉన్నంతవరకు కరాటేలో కొనసాగుతామన్నారు. స్పోర్ట్స్ పై సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ఆసక్తి ఉందన్నారు. ఫుట్ బాల్ ఆటగాడు మెస్సీ త్వరలో హైదరాబాద్ కి రాబోతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వర్సెస్ మెస్సీ ఫుట్ బాల్ మ్యాచ్ ఉండే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.



వార్తలలో వ్యక్తిగత అభిప్రాయాలు వద్దు

- మీడియా సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించాలి
- టీడబ్ల్యూజేఎఫ్ జనరల్ సెక్రటరీ బసవపున్నయ్య

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16 : 'నేషనల్ ప్రెస్ డే' సందర్భంగా మీడియా అకాడమీ అధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ అకాడమీ కార్యాలయంలో 'అసత్య వార్తలు – మీడియా విశ్వసనీయత – రక్షణ' అనే అంశంపై ఆదివారం నాడు సెమినార్ జరిగింది. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవులపల్లి అమర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ బి బసవపున్నయ్య మాట్లాడుతూ, పత్రికలు, ఛానళ్ల పాలసీకి అనుగుణంగా వార్తలు ప్రచురిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యల కోణంలో మీడియా సంస్థలు పనిచేయాలని ఆకాంక్షించారు. వార్త విశ్వసనీయత పరిశీలించి నిజాలు నిర్ధారణ చేసుకున్న తర్వాతే ప్రచురించాలని అభిప్రాయపడ్డారు. వార్తలలో వ్యక్తిగత అభిప్రాయాలను చొప్పించకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, అప్పుడే ఆ పత్రిక, చానల్ పట్ల ప్రజలలో విశ్వసనీయత పెరుగుతుందని అన్నారు. వ్యక్తులు, రాజకీయ పార్టీలకు కొమ్ముకాయకుండా స్వతంత్రంగా మీడియా సంస్థలు వ్యవహరించాలని కోరారు. అనుదినం జనస్వరం వినిపిస్తూ ప్రతి అక్షరం ప్రజల పక్షం ఉంటేనే ఆ పత్రిక, చానళ్లకు మనుగడ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ నాయకులు మారుతి సాగర్, సమాచార శాఖ అడిషినల్ డైరెక్టర్ డీఎస్ జగన్,జాయింట్ డైరెక్టర్ వెంకట రమణ, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, అధికారులు శైలేశ్వర్ రెడ్డి, వనజ, తదితరులు పాల్గొన్నారు.



నా ఫొటోలను ఉపయోగిస్తూ పలువురు మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటివాటి పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఫొటోషూట్‌ల పేరుతో ఫొటోగ్రాఫర్లకు దుండగులు వాట్సాప్‌లో నా ఫొటో పెట్టుకొని సంప్రదిస్తున్నారు. నేనెప్పుడూ నా వర్క్‌కు పర్సనల్ నంబర్‌ను వాడను. ఏదైనా నా టీమ్ చూసుకుంటుంది. కాబట్టి ఈ విషయంలో అప్రమత్తంగా ఉండండి.

- హీరోయిన్ అదితీరావు హైదరీ

స్టేట్‌లో జంప్ స్టంట్!!

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేలు ఆలోచనలో పడ్డారని అంటున్నారు. కారు దిగి చేక్ హ్యాండ్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారని చెబుతున్నారు. గతంలో కొంత మంది కారు దిగి పోగా, మిగిలిన కారు దిగిపోయేందుకు సిద్ధంగా ఉన్నారనే ప్రచారం సాగుతోంది. గులాబీ కోట లో పట్టు జారి పోతున్న రాజకీయ పట్టుత్వం, కుటుంబ కలహాలు, నాలుగు ముక్కలాట లాంటి సమస్యలతో 'కారు వద్దు బాబోయ్.. చేయి ముద్దు' అంటూ రేవంత్ చెంతకు చేరే పనిలో గులాబీ ఎమ్మెల్యే లు పడ్డట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బీఆర్ఎస్ మీద అధినేత కేసీఆర్ పట్టు కోల్పోతున్నారని అంటున్నారు. అటు కీలక నేతలు సమన్వయం చేయలేకపోతున్నారని అంటున్నారు. అందుకే పలువురు ఎమ్మెల్యేల పక్క చూపులు చూస్తున్నారని, మరి కొద్ది రోజులలోనే రాజకీయాలు మారుతాయని అంటున్నారు. మరి, ఇప్పుడంతా తుఫాను ముందటి ప్రశాంతతేనా?!

మరి ఎందుకు ఈ మార్పులు?

రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ ఎమ్మెల్యేలు పార్టీ వదిలే ప్రధాన కారణాలు ఇవే: పార్టీ అంతర్గత అసంతృప్తి: భిన్న వర్గాల మధ్య వర్గపర విభజన, నాయకత్వం పై అసంతృప్తి. అభివృద్ధి నిధుల కేటాయింపు సమస్యలు: స్థానిక పనులకు నిధులు సమయానికి లేకపోవడం. భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై అనిశ్చితి: వచ్చే ఎన్నికలలోనే ప్రాధాన్యతలు, స్థానం కేటాయింపులు, రాజకీయ ప్రాధాన్యతల విషయంలో స్పష్టత లేకపోవడం. ఢిల్లీ పర్యటనల ప్రభావం: రాజధానిలో జరిగిన చర్చలు ఈ పరిణామాలకు మరింత ఊతం ఇచ్చినట్లుగా తెలుస్తోంది. రాష్ట్ర రాజకీయ వర్గాల విశ్లేషణ ప్రకారం, ఈ 10 మంది ఎమ్మెల్యేలు తీసుకునే నిర్ణయం వచ్చే కొన్ని రోజులలోనే బయటకు వచ్చే అవకాశం ఉంది. ఒకసారి ఈ జంప్ పూర్తి అయితే, తెలంగాణ రాజకీయ రంగంలో కొత్త సమీకరణాలు, శక్తి కేంద్రాలలో మార్పులు స్పష్టమవుతాయి.

స్పీకర్ నిర్ణయం కీలకం

'ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ చట్టబద్ధంగా నిర్ణయం తీసుకుంటారని అనుకుంటున్నాం. కానీ, ఇది సులభంగా జరగదని అనిపిస్తోంది' అని కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందుకు ఆయన కోల్‌కతా స్పీకర్ కేసును ఉదాహరణగా ప్రస్తావించారు. అక్కడ స్పీకర్ నిర్ణయం తీసుకోలేకపోవడం వల్ల హైకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ జంప్ పూర్తయితే బీజేపీ, కాంగ్రెస్, ఇతర విభాగాల మధ్య కొత్త కౌన్సెలింగ్ ఏర్పడే అవకాశం ఉంది. బీఆర్ఎస్ పార్టీలో శక్తి నిర్మాణం, స్థానిక నాయకత్వ ప్రాధాన్యతలపై ప్రభావం పడే అవకాశం ఉంది. స్థానిక అభివృద్ధి, రాజకీయ సమీకరణాలు, ఫ్యూచర్ ఎన్నికల ఫలితాలపై పునర్మూల్యాంకనం అవసరం ఉంటుంది.

ఆర్‌ఎఫ్సీ నాలుగో అద్భుతం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16 : రామోజీ గ్రూపు సంస్థలు తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి గర్వకారణంగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నగరంలో చార్మినార్, గోల్కొండ, హైటెక్ సిటీ వరుసలో నాలుగవ అద్భుతంగా రామోజీ ఫిల్మ్ సిటీ గుర్తింపు తీసుకొచ్చిందని చెప్పారు. పత్రికా రంగంలో తనదైన ముద్ర వేసిన రామోజీరావు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రోత్సహించిన రంగాలలో విశేష సేవలు అందిస్తున్నవారిని గుర్తించి రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులను బహూకరించింది. రామోజీ 89 వ జయంతిని పురస్కరించుకుని రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ అవార్డుల బహూకరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు , బండి సంజయ్, రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రామోజీ రావు ఏ విలువలు, సంప్రదాయాలను తెలుగు ప్రజలకు అందించారో ఆ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న వారిని గుర్తించి ఎక్సలెన్స్ అవార్డులను అందించడం అభినందనీయమని అన్నారు.

నంది అవార్డుల నుంచి ఆస్కార్ అవార్డుల వరకు

తెలుగు చలనచిత్ర రంగం నంది అవార్డుల నుంచి ఆస్కార్ అవార్డుల వరకు ఎదగడంలో రామోజీ ఫిల్మ్ సిటీ ఎంతో తోడ్పాటును అందించిందని సీఎం అన్నారు. టాలీవుడ్, బాలీవుడ్ కాకుండా హాలీవుడ్ సహా స్క్రిప్ట్ తో రామోజీ ఫిల్మ్ సిటీలోకి ప్రవేశిస్తే ప్రింట్ తీసుకుని వెళ్లేలా అద్భుతమైన కళాఖండాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. రామోజీ రావు ఏ రంగంలో ప్రవేశించినా అందులో తనదైన ముద్ర వేశారని చెప్పారు. వయసు పైబడినప్పటికీ నిత్యం పనిలోనే సంతృప్తి ఉంటుందని చెప్పేవారని, ఒక నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. రామోజీ ఒక పేరు కాదని, అదొక బ్రాండ్ అని, ఆ బ్రాండ్‌ను కొనసాగించే విషయంలో గ్రూపు సంస్థలకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో తెలుగు భాష అభివృద్ధికి కొన్ని చర్యలు తీసుకున్నామని, కొంత సమయం పట్టినప్పటికీ తెలుగు భాషలో పాలనా వ్యవహారాలను కొనసాగించే విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విశేష కృషి చేసిన ఏడుగురు ప్రముఖులకు

వివిధ రంగాలలో విశేష కృషి చేసిన ఏడుగురు ప్రముఖులకు రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను బహూకరించారు. జర్నలిజంలో ఇండిపెండెంట్ జర్నలిస్టు, రచయిత జైదీప్ హర్దీకర్ కు, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పనిచేస్తున్న సామాజిక కార్యకర్త ఇంపాక్ట్ అండ్ డైలాగం ఫౌండేషన్ వ్యవస్థాకురాలు పల్లబి ఘోష్, ప్రముఖ పర్యావరణ వేత్త, ఆకార్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, చైర్మన్ అమలా అశోక్ రూయా ఎక్సలెన్స్ అవార్డులు అందుకున్నారు. సామాజిక విద్యావేత్త, పెహచాన్ స్కూల్ వ్యవస్థాపకుడు ఆకాశ్ టాండన్ కు ఆదివాసీ భాషలను పరిరక్షించడంలో విశేష కృషి చేసిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సెలర్, ప్రొఫెసర్ సత్తుపతి ప్రసన్న శ్రీకి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ మధవీలతకు అంధుడైన పారిశ్రామిక వేత్త శ్రీకాంత్ బొల్లాకు ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రామోజీ గ్రూపు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్, మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్ శైలజా కిరణ్, రామోజీ ఫిల్మ్ సిటీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విజయేశ్వరితో పాటు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

యాంజాల్ దేవదాయ భూములలో అక్రమాలు?!


2021లో భూమిని సర్వే చేస్తున్న ట్రెయినీ ఐఏఎస్ లు

మొదటిపేజీ తరువాయి

ప్రజలు కోరుతున్నారు.

ఇంతకీ ఈ భూములు ఎవరివి!

ఈ భూములు దేవుడికి సంబంధించినవా! లేక రైతులకు సంబంధించినవా అనే అనుమానాలు ఉన్నాయి. మొదటగా ఒక రైతు పేరుపై 1521 ఎకరాల భూమి ఉంది. అతనికి సంతానం లేకపోవడంతో ఇట్టి స్థలాన్ని రాముడి ఆలయానికి విరాళంగా ఇచ్చేశాడు. ఆలా ఆ భూములు 1925 నుండి 1933 వరకు పహాణీలో రికార్డులో ఉన్నాయి. 1934 నుండి ఆకస్మాత్తుగా మరికొందరి పేర్లు పహాణీలలో దర్శనమిచ్చాయి. రికార్డులు తారుమారు చేశారా తెలియదు. అవి దేవుడి భూములని ప్రభుత్వ అధికారులు, లేదు తమ భూములని రైతులు, స్థానిక ప్రజలు వాదిస్తుండగా, ఈ వివాదం హైకోర్టుకు చేరింది. ప్రభుత్వం, కోర్టు ఈ దేవాలయ భూముల వ్యవహారం తేల్చకముందే భూములలో అక్రమ కట్టడాలు ప్రారంభమై, ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద పెద్ద గోదాంలు వెలిశాయి. ఆ భూముల పర్యవేక్షణా మేడ్చల్ జిల్లా కలెక్టరే. ఇంత జరుగుతున్నా కలెక్టర్ వ్యవస్థ ఎం చేస్తుందో తెలియడం లేదని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమాలకు కాపలాగా మున్సిపల్ కమిషనర్ జ్యోతి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన నిద్ర మత్తులో ఉన్నారని మండి పడుతున్నారు. అక్రమాలకు పాల్పడితే యూడీఎంఏ అధికారి సంధ్య ఏం చేస్తున్నారని తూంకుంట పట్టణ ప్రజలు అడుగుతున్నారు. మున్సిపల్ ప్రత్యేకధికారి శ్రీదేవి దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

అక్రమాలను సాహించేది లేదు: కమిషనర్ జ్యోతి

దేవాలయ శాఖ భూములలో ఎలాంటి అక్రమాలకు పాల్పడితే సాహించేది లేదని మునిసిపల్ కమిషనర్ జ్యోతి చెబుతున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గోదాంలకు ఇంటి నెంబర్లు ఎవరు ఇచ్చారో తన దృష్టికి రాలేదని, దీనిపై విచారణ జరిపి వాటిని రద్దు చేస్తామని పేర్కొన్నారు.

తండ్రే 'యమకింకరుడు'

- అంగవైకల్యం ఉందని దారుణం
- కూతురికి ఉరేసి హత్య, కొడుకుపై హత్యాయత్నం





ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 16: కరీంనగర్‌లో మానవత్వాన్ని కలచివేసే సంఘటన వెలుగులోకి వచ్చింది. కుటుంబ సమస్యలు, పిల్లల అంగవైకల్యం కారణంగా తీవ్ర నిరాశకు గురైన తండ్రి మల్లేశం తన ఇద్దరు చిన్నారులను ఉరి వేసి చంపేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. మల్లేశం కూతురు అర్చనకు ముందుగా ఉరేసి చంపేశాడు. చిన్నారి ప్రాణాలు కోల్పోయిన విషయం గ్రామంలో షాక్‌కు గురిచేసింది. తరువాత తన కుమారుడు ఆశ్రిత్‌ను కూడా హత్య చేయాలని ప్రయత్నిస్తున్న సమయంలో అతని భార్య ఇంటికి చేరుకుంది. అకస్మాత్తుగా భార్య కనిపించడంతో మల్లేశం భయపడి అక్కడి నుండి పరారయ్యాడు. భార్య సమాచారంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చిన్నారి అర్చన మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం పంపారు. కుమారుడు ఆశ్రిత్‌ను మాత్రం సమయానికి కాపాడగలిగారు. పోలీసులు కేసు నమోదు చేసి, హత్య చేసి పరారైన మల్లేశం కోసం గాలింపును ప్రారంభించారు. అతడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమీప ప్రాంతాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పిల్లలను చంపేందుకు తండ్రి చేసిన ఈ ప్రయత్నం పట్ల గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.పిల్లలకు అంగవైకల్యం ఉండటం, కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యలు ఈ హృదయ విదారక ఘటనకు కారణంగా భావిస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం నిజమైన వివరాలు బయటకు వచ్చే అవకాశముంది.

అవినీతి సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు

- ప్రభుత్వానికి ఏసీబీ సమగ్ర నివేదిక
- సీరియస్ గా తీసుకున్న ఉన్నతాధికారులు



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 16: తెలంగాణవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ల కదలికలపై అవినీతి నిరోధక శాఖ డేగ కన్నేసింది. అంతటా సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలు అవినీతి తో కూరుకుపోయాయి. ఎక్కడ చూసిన పైసా లేనిదే ఫైలు కదలడం లేదు. దీంతో సబ్ రిజిస్ట్రార్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలననే లక్ష్యం తో శోదాలు మరింత ముమ్మరం చేసింది. సబ్ రిజిస్ట్రార్లపై ఇక చర్యలు తప్పవనే సూచనాప్రాయంగా హెచ్చరించింది. ఇందులో భాగంగా తగు చర్యలు తీసుకునేందుకు గాను ప్రభుత్వానికి ఏసీబీ నివేదిక సమర్పించేందుకు సిద్దమైంది. రాష్ట్రవ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ల నుండి లెక్కల్లో చూపని రూ 2.51 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు కార్యాలయాలు ఇళ్లపై 299 మెరుపు దాడులు నిర్వహించి కీలక అంశాలను గుర్తించారు. ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు. ఇటీవల మొత్తం 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దాదాపు 23 ఏసీబీ బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. 13 మంది సబ్ రిజిస్ట్రార్ అధికారుల ఇళ్లలో కూడా ఏసీబీ అధికారులు ప్రత్యేక సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గండిపేట, శేరిలింగంపల్లి, మేడ్చల్, నిజామాబాద్ టౌన్, జహీరాబాద్, మిర్యాలగూడ, వనపర్తి, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, వైరాలోని సబ్ రిజిస్ట్రార్ అధికారుల ఇళ్లలో భారీగా బంగారు ఆభరణాలు, నగదు, ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత దర్యాప్తు కొనసాగుతోందని వారు వెల్లడించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు గంటల తరబడి తనిఖీలు నిర్వహించారు.



నిరుపమాన సమరయోధుడు బిర్సా ముండా

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- ఘనంగా బిర్సా ముండా 150వ జయంతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16 : భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ఆదివారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ తో కలిసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వివేకానంద విగ్రహం నుండి కొమరం భీమ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ గిరిజన వీరుడు భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను 'గౌరవ దివస్' కింద ఈ సంవత్సరమంతా జరపాలని నిర్ణయించామన్నారు. దేశంలో బీజేపీ, ఎన్డీయే కూటమి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో భగవాన్ బిర్సా ముండా జయంతి వేడుకలను అధికారికంగా జరుపుతున్నారన్నారు. బీజేపీయేతర రాష్ట్రాలలో పార్టీ తరపున వేడుకలను జరుపుతున్నామని చెప్పారు. 1875లో బిర్సా ముండా 25 యేండ్ల వయసులో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజన హక్కుల కోసం బిర్సా ముండా చేసిన పోరాటానికి గుర్తింపుగానే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

బండి సంజయ్ హోదాను మరిచిపోయారు

- కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు
- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16 : కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన హోదాను మరిచి మాట్లాడుతున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. హిందువులంతా ఏ పార్టీలో ఉన్నా బీజేపీలో చేరాల్సిన పరిస్థితి వచ్చిందని అనడం విచిత్రంగా ఉందన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎంపీగా ఉన్న సికింద్రాబాద్ లోకసభ నియోజకవర్గం పరిధిలోని జూబ్లీ హిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో బీజేపీకి డిపాజిట్ దక్కలేదన్నారు. బీజేపీ లోపాయికారిగా బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చిందా! బండి సంజయ్ ప్రజలకు క్లారిటీ ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ కు మద్దతు ఇచ్చారో లేదో బండి సంజయ్ కు తెలియకపోతే పార్టీలో చర్చించుకోవాలన్నారు. బండి సంజయ్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎవరికి ఓటు వేయాలో ప్రజలకు తెలుసన్నారు. నవీన్ యాదవ్ ఒక కులం, ఒక మతం ఓట్లతో గెలవలేదని, అన్ని వర్గాలవారు ఓట్లు వేస్తే గెలిచారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో బీసీ బిడ్డకు టిక్కెట్ ఇచ్చారని, ప్రజలు ఆదరించారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి నిధుల కోసం కిషన్ రెడ్డి,బండి సంజయ్ కృషి చేయాలని సూచించారు.

ఈ వ్యాఖ్యలు అప్పుడెందుకు గుర్తుకు రాలేదు!

- జాగృతి కవిత ఆత్మవిమర్శ చేసుకోవాలి
- బీఆర్ఎస్ పార్టీ విప్ కేపీ వివేకానంద గౌడ్



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16: 'కేసీఆర్ సర్కారు హయాంలో పదేండ్లు ఎంపీ, ఎమ్మెల్సీ వంటి పదవులలో కవిత ఉన్నప్పుడు లేని సమస్యలు ఇప్పుడెందుకు వస్తున్నాయి ? జూబ్లీ ఉప ఎన్నికతో ఎలాంటి సంబంధం లేదని, తీరా ఆ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత బీఆర్ఎస్ పార్టీపై, మాజీ మంత్రులపై వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం ఏమిటీ?' అని బీఆర్ఎస్ పార్టీ విప్ కేపీ వివేకానంద గౌడ్ సూటిగా ప్రశ్నించారు. అలాంటి వ్యాఖ్యలు చేయడం ఎవరి కోసం ? ఎవరి ప్రయోజనాల కోసం ? అంటూ నిలదీశారు. ఈ అంశంలో కవిత ఆత్మ విమర్శ చేసుకోవాలని హితవు పలికారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పై కవిత చేసిన వ్యాఖ్యలు చూస్తే, కాంగ్రెస్ కు ప్రయోజకరంగా ఉన్నట్టుగా అనిపిస్తుందన్నారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ నాయకులు చేసిన అరాచకాలు, రౌడీయిజం, ఈ ఎన్నికలో గెలిచిన తీరు తెన్నులు కనబడలేదా? చెప్పాలన్నారు. పార్టీ పెడితే పెట్టుకోండి కానీ, నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సూచించారు. కవిత కాంగ్రెస్ ట్రాప్‌లో పడ్డారన్నారు. అందుకే బీఆర్ఎస్ మాజీ మంత్రులను విమర్శిస్తున్నారన్నారు. కేటీఆర్, హరీశ్‌రావును కృష్ణార్జునులు అని సంభోధిస్తూ సెటైర్లు వేయడం మంచిది కాదన్నారు.



హరిత, పరిశుభ్ర నగరం కోసం

జీహెచ్ఎంసీ హ్యాపీ స్ట్రీట్స్ కార్యక్రమం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16 : నగర ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం పరిశుభ్ర, హరిత వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు జీహెచ్ఎంసీ, పలు సంస్థలతో కలిసి సంజీవయ్య చిల్డ్రన్స్ పార్క్ వద్ద ఆదివారం హ్యాపీ స్ట్రీట్స్ కార్యక్రమం నిర్వహించింది. 'క్లీన్, గ్రీన్ హైదరాబాద్' అనే అంశంతో సాగిన ఈ కార్యక్రమంలో నగర పరిశుభ్రత, చెత్త నిర్వహణ, వ్యర్థాల విభజన, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్ పర్యావరణ పరిరక్షకులైన పిల్లలలో అవగాహన పెంపుపై కార్యక్రమంలో ప్రత్యేక దృష్టి పెట్టారు. ఖైరతాబాద్ జోన్ కమిషనర్ అనురాగ్ హాజరై, నగర పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో వివరించారు. కార్యక్రమంలో భాగస్వాములు అయిన వారితో "స్వచ్ఛ సిటీ హీరోస్' ప్రమాణం చేయించారు. పిల్లలకు మొక్కలను పంపిణీ చేసి, హరిత హైదరాబాద్ నిర్మాణానికి సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

ముస్లింలకు కొమ్ముకాసే దుస్థితి

- దీంతో హిందువులలో కసి పెరిగింది
- హిందువులంతా ఓటు బ్యాంకుగా మారాల్సిందే
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు


ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16 : నగరంలోని కూకట్ పల్లిలో ఆదివారం నాడు జరిగిన కాపు కులస్తుల 'కార్తీక వన భోజనాల'లో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాల తరువాత ముస్లింలకు కొమ్ముకాసే దుస్థితి ఏర్పడిందన్నారు. దీంతో హిందువులలో కసి పెరిగిందన్నారు. హిందువులంతా ఓటు బ్యాంకుగా మారాల్సిందేనని పిలుపునిచ్చారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఇతర మతాలలో చేరిన హిందువులు 'ఘర్ వాపసీ'కి రావాలన్నారు. హిందూ ధర్మ రక్షణ కోసం వారికి ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు. మతాలను మార్చుకుంటే దేవుళ్లను మోసం చేసినట్లేనన్నారు. సనాతన ధర్మం గొప్పదని, హిందువుగా పుట్టడం గర్వకారణం అని పేర్కొన్నారు. అన్ని కులాలు తమ సామాజికవర్గ సంక్షేమానికి పాటు పడుతూనే హిందూ ధర్మం కోసం పని చేయాలన్నారు. సనాతన ధర్మ రక్షణే తన లక్ష్యం అని చెప్పారు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మ ప్రచారంతో ఇతర మతాలలో చేరిన హిందువులలో పునరాలోచన వస్తోందన్నారు.



ఉప రాష్ట్రపతికి సీఎం, మంత్రుల స్వాగతం

- రాజ్ భవన్ లో కార్యక్రమానికి హాజరు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో , హైదరాబాద్, నవంబర్ 16: భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆదివారం హైదరాబాద్ కు విచ్చేసారు. బేగంపేట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. రాజ్ భవన్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉప రాష్ట్రపతితో కలిసి పాల్గొన్నారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కు బేగంపేట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతం పలికారు. గవర్నర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.



తెలుగు సాహిత్యంలో మైలురాళ్లు

- 'వ్యాస చంద్రిక-1' 'అవరోధాలే అవకాశాలు'
- పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16 : రచయితలు యేచన్ చంద్ర శేఖర్, కోట దామోదర్ రచించిన 'వ్యాస చంద్రిక 1' (శాస్త్ర సాంకేతిక విజ్ఞాన సమాహారం), 'అవరోధాలే అవకాశాలు' (ప్రేరణాదాయక నిజ సంఘటనలు) పుస్తకావిష్కరణ కార్యక్రమం రవీంద్రభారతి మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఆదివారం ఉదయం జరిగింది. దీనికి సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ, ఆర్థికవేత్త ప్రొ. రవీందర్ రేనా, డర్బన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మాజీ అడిషనల్ డైరెక్టర్ బి సదానంద్, మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ డా. రవి కుమార్ చేగొని ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహతీ సాహితీ కవి సంగమం వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా అడిగొప్పుల సదయ్యతో పాటు ప్రభుత్వ పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయురాలు, సాహితీవేత్త వరలక్ష్మి యనమండ్ర పుస్తక సమీక్ష నిర్వహించారు. యేచన్ చంద్రశేఖర్ 'వ్యాస చంద్రిక 1' తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక రంగంలో ఒక అన్యోన్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. 'అవరోధాలే అవకాశాలు" అన్న శీర్షికతో కోట దామోదర్ రచించిన పుస్తకం అవరోధాలను ఎలా అవకాశాలుగా మార్చుకున్నారన్న వ్యక్తుల నేపథ్యాలను రేఖామాత్రంగా ఆవిష్కరించేవేనన్నారు. చివరగా పుస్తక రచయితలు యేచన్ చంద్ర శేఖర్, కోట దామోదర్ వందన సమర్పణ చేశారు.



టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

- రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16 : సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా కోరారు. హైదరాబాద్ నాంపల్లి హిందీ ప్రచారసభ కార్యాలయంలో నిర్వహించిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఒకవేళ టెట్ తప్పనిసరి అయితే భాషోపాధ్యాయులకు ప్రత్యేకంగా పేపర్ 3 నిర్వహించాలని కోరారు. జీఓ 317 ద్వారా నష్టపోయిన భాషోపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే డి ఏ లు ఇవ్వాలని, రిటైర్డ్ ఉద్యోగస్తులకు పెన్షన్ బకాయిలు చెల్లించాలని,రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీ ఆర్సీ ప్రకటించాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశం ప్రారంభంలో ఇటీవల మరణించిన రాష్ట్రగీత రచయిత ప్రముఖ కవి అందెశ్రీకి శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించారు. ఈ సమావేశం లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ, ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ, కోశాధికారి ఎన్. బిక్షపతి, సలహాదారు లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర బాధ్యులు పద్మజారాణి ,ఎస్.అరుణోదయ, షాబీర్, జహంగీర్, నసీరుద్దీన్,విష్ణుమూర్తి, జాన్ షాహెదా వివిధ జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.



పోలీసుల నిర్లక్ష్యంతోనే రాజశేఖర్ హత్య

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- నిజ నిర్ధారణ బృందం డిమాండ్

ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 16: షాద్‌నగర్ పట్టణ పోలీసుల నిర్లక్ష్యం వల్లే దళితుడైన రాజశేఖర్ హత్య జరిగిందని, వారిని సస్పెండ్ చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) నేతలు, ప్రజా సంఘాలు, న్యాయవాదులు నిజనిర్ధారణ బృందం సభ్యులు డిమాండ్ చేశారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని పరుఖ్ నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామంలో బాధిత కుటుంబాన్ని వారు ఆదివారం కలిసి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళితుడైన ఎర్ర చంద్రశేఖర్, బీసీ యాదవ్ కులానికి చెందిన భవానిని ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్నారన్నారు. దీనికి సహకరించడానే నెపంతో చంద్రశేఖర్ సోదరుడు రాజశేఖర్ ను అమ్మాయి తండ్రి వెంకటేశ్ ఈనె 12 కిడ్నాప్ చేసి హింసించి మహబూబ్‌నగర్ జిల్లా నవాబు పేట ప్రాంతంలో పెట్రోల్ పోసి తగలబెట్టి హత్య చేశారని ఆరోపించారు. మేజర్లు అయిన ప్రేమ జంటకు రక్షణ కల్పించకుండా పోలీస్ స్టేషనులో హింసించారని, దళిత కుటుంబాన్ని వేధించి ప్రేమ జంటను విడదీశారరని అన్నారు. నిజామాబాద్ పోలీసులు వివాహం చేశారన్నారు. హత్యకు సహకరించిన పోలీసుల పాత్ర పై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమం లో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, న్యాయవాదులు ఎద్దు దివాకర్, రిజ్వాన్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోళ్ల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ప్రస్తుతం క్వింటాల్‌కు ₹8,110 కనీస మద్దతు ధర ఉంది. అయినప్పటికీ బహిరంగ మార్కెట్‌లో రైతులకు ₹6,000--7,000 మాత్రమే దక్కుతోంది. రైతులు క్వింటాల్‌పై ₹2,000 వరకు నష్టపోతున్నారు. తేమ ఎక్కువగా ఉన్న పత్తిని కొనకుండా సీసీఐ కఠినంగా వ్యవహరిస్తోంది.

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆడపిల్లల విద్యకు ప్రత్యేక దృష్టి అవసరం

- జాగృతి రౌండ్‌టేబుల్ సమావేశంలో కవిత



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 16: తెలంగాణ విద్యా వ్యవస్థ ఇంకా అనేక అసమానతలు, లోపాలతో పోరాడుతూనే ఉందని, ప్రత్యేకంగా ఆడపిల్లల విద్య విషయంలో కుటుంబాలు తీసుకునే నిర్ణయాలలో పెరుగుతున్న వ్యత్యాసాలు ఆందోళనకరమని జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. చిన్న సౌకర్యాలే లేకపోయినా అమ్మాయిల చదువు ఆగిపోతున్న పరిస్థితులను మార్చేందుకు ప్రభుత్వం లింగ, సమాజ ప్రత్యేక విధానాలతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో మేధావులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలతో ఆమె విస్తృతంగా చర్చించారు. కవిత మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడే సమయంలో విద్యా వ్యవస్థ దయనీయ స్థితిలో ఉందని, ఉద్యోగాలు లేకపోవడంతో ఉన్నత చదువులు చదివిన యువత ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు తక్కువగా ఉండటంతో, యూనివర్సిటీలకు సరైన ప్రాధాన్యం లేకపోవడం వల్ల విద్యా రంగం వెనుకబడిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత చాలానే సాధించామన్నారు. రాజకీయ ఆరోపణల మధ్య విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. నిజామాబాద్ ఐటీ టవర్ ఉదాహరణగా చెబుతూ, మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక బస్సులు పెడితేనే వారిని పనిచేయడానికి పంపుతామని తల్లిదండ్రులు చెప్పిన దృక్పథం నుంచి ప్రభుత్వం తీసుకోవాల్సిన పాఠాలు ఉన్నాయని వివరించారు. విద్యావేత్త పరంజ్యోతి, విద్యావేత్త వెంకట్ రెడ్డి, సామాజికవేత్త గిరిజ పైడిమర్రి, ఆదివాసీ దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపకుడు కురిసంగ వేణు, విద్యావేత్త మురళీ గౌడ్, ఓయూ ప్రొఫెసర్ డా. వంశీధర్, ట్రస్మా చైర్మన్ వి.డి. రాజు తదితరులు మాట్లాడారు.

బహుళ

స్పందన

‘అన్నవరం’ ‘అట్లనే’ మట్టి కవిత

ఈ మధ్య చాలామంది ఉదయమే నడక ప్రారంభించారు. దాన్ని అధ్యయనం చేస్తూ వాకింగ్ గ్రౌండ్ పేరిట పేర్కొన్నట్టు ప్రతిరోజు పాదాచార పరిచయస్తులు, వాకింగ్ వ్యాపకం మనిషికి పచ్చని స్నేహం, పత్రికలకు ఎక్కని వార్తలన్నీ ఇక్కడనే తెలుస్తాయి, కనుల పలకరింపులు, చూపుల కరచలనాల వాకింగ్ గ్రౌండ్ అంటే పరిచయాల కూడలి. అవును వాకింగ్ గ్రౌండులో అనేక మంది మిత్రులతో అనేక విషయాలు తెలుస్తాయి.



డా. డి. రఘురామన్. MD
95506 30300


మిత్రులు సహృదయులు తెలంగాణ మట్టి కవి అన్నవరం దేవేందర్ ఈ మధ్యలో వారు ఆవిష్కరించిన ‘అట్లనే’ పుస్తకాన్ని నాకు అభిమానంతో ఇవ్వడం జరిగింది. నిజానికి నేను కవిని కాను, అలాగే కవిత్వం సమీక్ష చేయడం కూడా నా పరిధి కాదు. అయినా, ఈ ‘అట్లనే’ కవితా సంపుటిని చదివి నాకు తోచిన కొన్ని కవితలపై అభిప్రాయాలను ఇలా వ్యక్త పరుస్తున్నాను. దేవేందర్ మొదటగా లోపల కవిత్వం ఎలా మొదలవుతుంది! అనే మాటకు నలుగురితో కలిసి లోకానికి గొంతునివ్వడమే కవిత్వ పరమార్థం అన్నారు. అలాగే కవిత్వం తనకు తానే శిల్పమైతది అన్నారు. సృజనాత్మక కూడా సహజమైన ఉత్పత్తి అన్నారు. మరొక కవిత ‘సద్ది’ తెలంగాణ ప్రాంతంలో సద్ది అనే మాటకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది ఒకానొక పచ్చని పాత జ్ఞాపకం ఈ మధ్య. మా మనుమరాలు అన్నది సద్ది అదే టిఫిన్ బాక్స్, బుక్కు రెండు బరువే బరువు నేటి తరం చదువులకు అద్దం పట్టింది. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాలలో తమ జ్ఞాపకాల దొంతర వివరిస్తూ వందేండ్ల తెలుగు శాఖ అని పేర్కొన్నారు. ఇది వారికి వారి విద్యాలయం పట్ల ఉన్న అభిమానం, గౌరవం.

తమ జీవనం తమ వ్యాపారాలు

దక్కన్ పతాకం కవితలు వారు హైదరాబాదులోని వివిధ ప్రాంతాల ప్రజలు తమ జీవనం తమ వ్యాపారాలు తమ వృత్తిని ఎలా సాగించుకుంటున్నారో చక్కగా వివరించారు. దీన్ని వారు సాంస్కృతిక సహజీవనం అన్నారు. చక్కని మాట. ‘జాతీయ రహదారి’ కవితలో ఈ మధ్య ప్రభుత్వం చేపడుతున్న హైవేస్ జాతీయ రహదారుల గురించి రాస్తూ వారి పల్లెను రెండు దోస పచ్చలుగా చీల్చిందన్నారు. ఈ రహదారి మన ఊరు గుర్తుపట్టరానిదిగా మారిందన్నారు. అలాగే, రహదారిని నాలుగు వరసల నున్నటి యమధర్మ దారులు అన్నారు. నిజంగానే నేడు మనం చూస్తున్నాం. ఈ రహదారుల వల్ల లాభాలున్నా, అత్యంత వేగం వల్ల ఎంతోమంది ప్రమాదాలకు గురై ప్రాణ నష్టం సంభవిస్తూంది. మరొక కవిత వంటశాలలో వనితల కార్య క్షేత్రమే కాదు పురుషోత్తములకు సైతం పని ఉంది అన్నారు. ఈ రోజులలో ఎన్నో కుటుంబాలలో మగవారు వంట చేయడం మనం చూస్తూనే ఉన్నాం మారిన సామాజిక సమీకరణ ‘దింపుడు కళ్లం’ అన్న కవితలో చావు గురించి వివరిస్తూ తాను మాట్లాడాలనుకున్నప్పుడు ఎవరూ కనపడలేదు కానీ, ఇప్పుడు అందరూ చెవిలో పిలుస్తున్నారు. తాను కనపడని లోకాలకు అగ్గిలో కాలిపోయారు ఇది నిజంగా మనసుకు హత్తుకునే మాట.

ఈ మధ్యలో పెరుగుతున్న ఆయు ప్రమాణం

కవి ఈ మధ్యలో పెరుగుతున్న ఆయు ప్రమాణం దృశ్య సమాజంలో పెద్ద వయస్సు వారు వృద్ధులు పెరిగిపోతున్నారు. దీనిని దేహపుటాకు అని ఇది ఒక పెద్ద మనిషితనం అన్నారు ఇది దేహంలోనూ జీవకణం క్షీణించడం అనే గుణం అన్నారు. ఇంకో కవితలో కత్తెర కళ ఇందులో నాయి బ్రాహ్మణ వృత్తిని సున్నితంగా సృజించి వారు



చేస్తున్న పనిని అదొక సేవా జీవన కళాత్మక వృత్తి ధర్మం అన్నారు ఎంతో గొప్ప మాట అలాగే ఆ రోజుల్లో ఆసుపత్రులు వైద్యులు నర్సులు లేని కాలంలో వారి మంత్రసానులు ఎంతోమందికి పురుడు పోసేవారు వారిని గౌరవంగా జనులకు జనని అన్నారు గొప్ప గౌరవంగా ఇంకో కవిత జిందగీలో వారు మాట్లాడుతూ చేసేది లేదు కానీ వ్యవసాయం గురించి ఉపన్యాసాలు ఇస్తారు అలాగే పర్యావరణం గురించి ప్రసంగాలు చేస్తారు ఇలా ఆచరణలేని ఉత్త వ్యక్తికరణ శూన్యం అని వారి భావన కానీ కవి గురించి చెబుతూ కదిలేది లేదు కానీ కలం అయితే నడిపిస్తారు అన్నారు. మన సిద్దిపేట జిల్లా పక్కన కొండపాక గ్రామంలో కల ఆనందా నిలయం వృద్ధాశ్రమాన్ని దర్శించి దేవేందర్ గారు అక్కడి వృద్ధుల గురించి ఇలా రాశారు రెండు కాళ్లకు తోడుగా ఒక చేతి కర్ర, కొందరు చక్రాల కుర్చీల్లోనే చలనం మరికొందరికి మంచమే మైదానం, అందరి కళ్ళలోనూ అనుభవాల జల చివరగా వారు వృద్ధాప్యం అంటే ముసలితనం కాదు. వృద్ధి చెందిన జ్ఞాన తరంగం అన్నారు చాలా గొప్ప భావ వ్యక్తీకరణ దేవేందర్ గారికే సాధ్యం

ఉదయం నడక అధ్యయనం

ఈ మధ్య చాలామంది ఉదయమే నడక ప్రారంభించారు. దాన్ని అధ్యయనం చేస్తూ వాకింగ్ గ్రౌండ్ పేరిట పేర్కొన్నట్టు ప్రతిరోజు పాదాచార పరిచయస్తులు, వాకింగ్ వ్యాపకం మనిషికి పచ్చని స్నేహం, పత్రికలకు ఎక్కని వార్తలన్నీ ఇక్కడనే తెలుస్తాయి, కనుల పలకరింపులు, చూపుల కరచలనాల వాకింగ్ గ్రౌండ్ అంటే పరిచయాల కూడలి. అవును వాకింగ్ గ్రౌండులో అనేక మంది మిత్రులతో అనేక విషయాలు తెలుస్తాయి. ఈమధ్య పూర్వ విద్యార్థుల కలయికలు, వాట్సప్ గ్రూపుల ఎక్కువ అయ్యాయి. అలా, దేవేందర్ తన విద్యాభ్యాసం జరిగిన హుస్నాబాద్ పాఠశాల గురించి రాస్తూ బడి జ్ఞాపకాల సింగిడి ఈ కవితలో తమకు విద్యాబుద్ధులు లోకజ్ఞానం, సంస్కారం నేర్పించిన ఉపాధ్యాయులను పేరుపేరునా తలచుకొని వారికి తన గౌరవాన్ని వ్యక్తపరిచారు. హుస్నాబాద్ పరిసరాలను కూడా చాలా చక్కగా వివరించారు. ఇలా దేవేందర్ కవితలు ఇంకా చాలా ఉన్నాయి నాకున్న పరిధిలో నాకున్న భావవ్యక్తీకరణలో పై విషయాలను చెప్పా. దేవేందర్ కవిత్వంలో బహుముఖ ప్రజ్ఞాశాలి. నలిమెల భాస్కర్ తో కలసి ‘వెన్నీల ముచ్చట్లు’ అనే ఒక కార్యక్రమాన్ని చేపట్టి దాదాపు 150 నెలలకు పైగా ఎంతోమంది యువకులకు ప్రోత్సాహాన్ని సలహాలను ఇచ్చి, కరీంనగర్ స్థానాన్ని కవిత్వంలో అగ్రస్థానంలో నిలపడానికి విశేష కృషి జరుపుతున్నారు. వారి కార్యక్రమంలో నన్ను ఆహ్వానించి నన్ను పాల్గొనేటట్టు చేయడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

(స్పందన: ప్రముఖ వైద్యులు, కరీంనగర్)

పరిచయం

కళలు, సాహిత్య వంతెన

బినోదినీ దేవి




డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

మణిపురికి చెందిన ప్రముఖ రచయితలలో ఒకరుగా పేరొందిన మహారాజ్ కుమారి బినోదినీ దేవి 6 ఫిబ్రవరి 1922న జన్మించారు. ఆమె చరిత్రాత్మకంగా, విప్లవాత్మకంగా పోషించిన సజీవ భూమిక పురాతన రాచరికం, ఆధునిక కళ రెండు ప్రపంచాలను కలిపేందుకు అక్షరాన్ని సాహితీవంతెనగా ఓ ఆయుధంగా మలుచుకున్న ప్రసిద్ధ మణిపూర్ రచయిత. రాజభవనం జీవితంలో యువరాణిగా జన్మించారు. దీనిని ఆమె తన చివరి వ్యాసాల పరంపరలో ప్రేమగా గుర్తు చేసుకున్నారు, నవలా రచయిత్రిగా, చిన్న కథలు, వ్యాసాలు, నాటకాలు, అవార్డు గెలుచుకున్న స్క్రీన్ ప్లేలు, పాటలు, బ్యాలెట్ స్క్రిప్ట్ ల రచయిత్రిగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందారు. ఈమెకు 1976లో పద్మశ్రీ పురస్కారం లభించింది.1976లో ఆమె రాసిన చరిత్రాత్మక నవల బోరో సాహెబ్ ఒంగ్బి సనాతోంబికి 1979లో సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ పుస్తకం ఆంగ్ల అనువాదం ‘ది ప్రిన్సెస్ అండ్ ది పొలిటికల్ ఏజెంట్’ 2020 లో పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియాచే పెంగ్విన్ మోడ్రన్ క్లాసిక్గా ప్రచురించబడింది. బినోదినీ సాహిత్య అకాడెమీ పురస్కారం అందుకున్న గొప్ప మణిపురి రచయిత.రాజప్రాసాదంలో జన్మించిన ఆమె యువరాణిగా జీవించారు. ఈ సత్యాన్ని ఆమె తన చివరి వ్యాస సంహిత పరంపరలో ప్రేమతో గుర్తు చేసుకున్నారు. చరిత్రకు అందేలా అక్షరీకరించిన అరుదైన గొప్ప రచయిత. ఆమె ప్రపంచవ్యాప్తంగా బ్యాలెట్ స్క్రిప్ట్స్ రచయిత్రిగా గుర్తింపు పొందిన బినోదినీ దేవి నవల,చిన్న కథలు, నాటకాలు, వ్యాసాలు రచించింది. 1976లో పద్మశ్రీ అందుకున్న వినోదినీ దేవి ఆమె చారిత్రక నవల ‘రోబో సాహెబ్ ఒంగ్బి సనాతోంబికి’ 1979లో సాహిత్య అకాడమీ అవార్డ్ అందుకున్నారు. దీనిని ‘ప్రిన్సెస్ అండ్ ది పొలిటికల్ ఏజెంట్’ 2020లో పెంగ్విన్ రాండమ్ ఇండియా సంస్థ ప్రచురించింది. ఆమె రచనా వ్యాసంగం బహు విస్తృతమైనది.మణిపురిలో నుంగైరక్త చంద్రముఖి 1965లో,1966లో చిన్నకథలు, అసంగ్బా నోంగ్జాబి (క్రిమ్సన్ రేయిన్ క్లౌడ్స్ నాటకాలు, రోబో సాహెబ్ ఒంగ్బి సనతోంబికి నవల 1979లో రచించారు. అటు,సనా వాంగోల్ మణిపూర్ రాజుసర్ మహారాజ చురాచంద్ సింగ్, మహారాణి ధనమంజురి దేవి తల్లిదండ్రులు. ఆమె మణిపూర్ లో తొలి పట్టభద్రురాలు. 26 జనవరి 1950న లైఫుంగ్ బామ్. నంద బాబు రాయ్ నుజ పెళ్ళాడారు. వారి సంతానంగా ఎల్. దేబబ్రత రాయ్, ఎల్. సోమి రాయ్ ఇరువురు కుమారులు.వినోదినీ దేవి శాంతినికేతన్ లో కళలు చదివారు. ఆమె శిల్పకళ ప్రవీణురాలు. ఆమె వేసిన చిత్రరాజాలు ఎన్నో న్యూఢిల్లీలోని జాతీయ ఆధునిక కళా వేదికలో ఇప్పటికీ భద్రపరిచి ఉన్నవి. ఎమ్.కే.వినోదినీ దేవి ఫౌండేషన్ ఇంఫాల్ లో కొడుకు సోమి రాయ్ స్థాపించినది కలదు.అది ఆమె వారసత్వ గరిమను భద్రపరిచి రక్షించి అభివృద్ధి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నది. ఆమె మణిపురి పాటలు ఇప్పటికీ గానం చేయబడుతవి. ఇంఫాల్ ఆకాశవాణిలో ప్రసారం అవుతాయి కూడా. ఆమె రాసిన సుఖ్న మాహ్లా గుహా నన్నుదా వంటి దేశభక్తి గేయాలు కలవు. ఆధునిక మణిపురి బ్యాలెట్స్ ఆరు రాశారు. అవి జేఎన్ మణిపురి డాన్స్ అకాడమీచే రూపొందినవి. నృత్య కళ పట్ల ఆమెకు మక్కువ,అభిరుచి ఎక్కువే.



ఎన్నో ప్రదర్శనలు కూడా ఇచ్చారు. సామాజిక స్పృహతో వ్యాసాలు రాశారు. ఆమె 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1951లో మణిపూర్ అసెంబ్లీకీ ఎన్నికయ్యారు. ఆమె పొందిన అవార్డులలో నుంగైరక్త చంద్రముఖి, జామినీ సుందర్ గుహ గోల్డ్ మెడల్, పద్మశ్రీ, 1976, 2001లో తిరిగి వచ్చింది రెండుసార్లు, బోరో సాహెబ్ ఒంగ్బి సనతోంబి, సాహిత్య అకాడమీ అవార్డు, కమల్ కుమారి జాతీయ సాంస్కృతిక పురస్కారం, ప్రముఖ సీనియర్ రచయిత అవార్డు, సాహిత్య అకాడమీ, జీవిత సాఫల్య పురస్కారం , మణిపూర్ రాష్ట్ర కళా అకాడమీ, (మరణానంతరం), 9వ మణిపూర్ రాష్ట్ర చలనచిత్ర అవార్డులలో నంగ్నా కప్పా పక్కాడే చిత్రానికి ఉత్తమ కథ అవార్డు వంటివి అందుకున్నారు. బహుముఖీన రచనలు దాదాపు అన్ని సాహిత్య ప్రక్రియలలో విస్తృతంగా విస్తారంగా చేసిన ఆమె చిన్నకథలు, నాటకాలు నవలలు వ్యాసాలు మరెన్నో రాసి ప్రఖ్యాతి పొందిన ఆమె రాచరికం చూశారు. ప్రజాస్వామ్యం చూశారు. ప్రజలతో మమేకమైనారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఆమె విభిన్నమైన రెండు శక్తివంతమైన జీవితాల సజీవ వంతెనగా చరిత్రకెక్కిన గొప్ప సాహితీమూర్తి వినోదినీ దేవి 17 జనవరి 2011న యైస్కుల్, ఇంఫాల్ లో కన్నుమూశారు.

(పరిచయకర్త కవి, విమర్శకులు)



ఎడారి వసంతం–27

గొలుసు కథ

సింగిడి

పేజీ 11లో

కవిత



నిరంతర ‘నిప్పుల వాగు’

‘అందె’ల రవళి ఆగిపోవట మంటే!?
రేపు మళ్లీ
సరిగమల సవ్వడై ధ్వనించటమే
ఉద్యమ ధూం ధాం
ఊపిరి పొదలటమంటే!?
జయ జయహే తెలంగాణ హోరు
జయకేతనమై మళ్లీ మళ్లీ
మన హృదయ గదుల్లో మారుమ్రోగటమే
లోకకవి నిశ్శబ్దమవ్వటమంటే!?
తాత్విక తంత్రులపై
నిరంతరంగా నిప్పులవాగై ప్రవహించటమే

జానపద పదబంధాలు హత్తుకుని
నవ్వుల్లో నాగమల్లినీ పాలవెల్లినీ ఎత్తుకునీ
గంభీరంగా ఘీంకరించిన కవి కరి అతడు
కాలధర్మంలోని
ఉదయాస్తమయాల్లో ఉషస్సు అతడు
కవిత్వ కొయ్యకు కట్టిన తెప్ప
ఇప్పుడు తెగిపోయి ఉండవచ్చు కానీ
జైబోలో తెలంగాణ అంటూ ఆయనలో
ప్రభవించిన పాట వెలుగు దారికి దిక్సూచై
కొమ్మచెక్కిన బొమ్మై కొలిచి మొక్కిన అమ్మై
ఆత్మగౌరవ అస్తిత్వమై ..ప్రవహిస్తున్న నావ

బడి చదువుల ఒడి తెల్వని వాడా
వాక్కులమ్మ వాచకమైన వాడా..
ఓ మహామనీషి..ఋషి.. మహర్షీ
వెదురునార విల్లులా..
రేలా పాటల స్వర ఝరిలా
గొర్ల కాపరి అశు ధారలా
గల గల పారె సెలయేరులా
అడవి బిడ్డల కొమ్ముబూరలా
ఎంత సహజమో నువ్వు
ప్రకృతి ఔపోసన నువ్వు..ప్రజా భాష నువ్వు

మాయమై పోతున్న మనిషిని
నీ మంత్రాక్షరాలతో భద్రం చేసిన వాడా
నువ్వెక్కడికి ఎల్లగలవు ఎల్లయ్యా
ఎద ఎదలో యాదికొస్తుండగా

(అజరామర కవి అందెశ్రీ కి అశ్రునివాళి)



డా. కటుకోఝ్వల రమేష్
9949083327


సమీక్ష

కష్ట సుఖాల సంవేదనలే ‘కాలస్పర్శ’



డా. శ్రీ (దాసరి శ్రీరాములు)
9885500278

అనాదిగా మన ఆలోచనలు జీవన మనుగడ కోసం కావచ్చు, మనసు పొరలలో దాగి ఉన్న అనంత ఆవేదనల సంద్రం కావచ్చు, అప్పటిదాక నివురుచేగప్పబడి, ఇప్పుడు తన్నుకొస్తున్న ఆవేశం కావచ్చు. లేదా మదిని మదించి,శోధించిన ఓ కొత్త సృజన కావచ్చు. వీటిని రెండో వారితో జన వ్యవహారంలోని భాషతో పంచుకోవచ్చును. కానీ, ఆ వ్యక్తి తన భాషలోని పదాలను రమ్యముగా కూర్చి,అలంకారాలను అద్ది, ఆకట్టుకొనే విధముగ, ఓ ఆలోచన చేసే విధముగా చెప్పవచ్చును లేదా రేపటి కోసం రాసి పెట్టవచ్చును. దానినే కవిత్వమంటున్నాము. అట్టి కవిత్వ నిర్మాణ శిల్పిని కవి అంటున్నాము. చిరునవ్వును మోమున నిత్యము కలిగి, చెప్పదల్చుకున్న దానిని నిర్మొహమాటంగా చెప్పగలిగిన కవి ఎవరన్నా ఉన్నారంటే, అది మన పెరమాళ్ల ఆనంద్. ఆనందము మొఖమున కనపడ్డా, గుండెన దాగిన బాధను కనిపించనివ్వడు. నలుగురి బాగును సదా కోరుకునే ఆనంద్ సార్ కాలస్పర్శ కలిగినవాడు. కాబట్టే, కవనాలను కాలస్పర్శతో రాసి, కాలస్పర్శ కావ్యాన్ని వెలువరించారు. ఆ కృతిని తనను గన్న తల్లిదండ్రులు తిరుపతమ్మ, మదార్లకు అంకితమిచ్చిన ఆదర్శ కుమారుడు. తన కాలస్పర్శ కావ్యమును 43 కవితలను అలతి, అలతి పదాల కూర్పుతో, పాఠకులను ఇట్టే అకర్షిస్తూ, సులభంగా అర్థమయ్యే రీతిలో తన సృజనశీలతకు ఓ మచ్చుతునకగా నిలిపారు. ఆనంద్ కుల, మత, ప్రాంత పట్టింపులు లేని మానవతా దృక్పథం తనువెల్ల మూర్తీభవించిన మహామనీషి. అందుకే కనపడని కరోన రక్కసికి లోకులంత పిట్టలు రాలినట్లు ప్రాణాలు విడుస్తుంటే చలించిన వాడై, 'నాకు బానిసలు కావాలి' 'విధ్వంసం మాత్రం విశ్వమంత' 'వెళ్ళొద్దాం రండి' రోడ్డు పొడవునా' 'బతుకు చిత్రాలు' అలాగే 'కాలం చేసిన గాయం'. వంటి ఆరు కవితలను రాసినారు. ‘వలస జీవుల వెతల / మంటలు ఆరనెలేదు / ఎన్నిమాయా నవ్వుల్తో / ఆ మత్తు మహమ్మారిని /జన సమూహాల్లోకి వదిలింర్రు / ఇప్పుడు తన బానిసలను వెతుక్కుంటుంది / అడ్డుంకులుండొద్దని / వాళ్ళకు ప్రజా సంక్షేమం / శ్రేయోరాజ్యం ఇదేనట’ ఈ కవితా పంక్తులలో కడుపుకూటి కోసం ప్రాంతం కాని ప్రాంతానికి వలసపోయిన వారి వెతలు పట్టించుకోక దేశాభివృద్ధి కుంటుపడుతుందనే మాటును దోస్తుల యాపారానికి లాక్ డౌన్ ఎత్తేశారని బాధపడుతాడు కవి. ‘విజ్ఞానశాస్త్రమే మానవాళికి మధుర ఫలాలనందించును, మతమొక మూఢనమ్మకమే, అది ఆపదలో ఆదుకోలేనిదంటాడు’ కవి ఆనంద్. కింది విధముగ ‘కరోనను ఖతం



ప్రతులకు:
పెరమాళ్ల ఆనంద్
98855 00278
ధర :100,
112 పేజీలు

చేసే ఆయుధమే లేదిప్పుడు / ప్రపంచమంతా సైన్స్ వైపే చూస్తుంది / సమాధానం చెప్పలేని / గుడి, చర్చి, మసీదు /మౌనం వహించాయి’ అంటాడు. కరోన వాక్సిన్ ప్రయోగానికి ప్రాణాన్ని ఫణంగా పెట్టిన జెన్నీఫర్ త్యాగాన్ని కొనియాడాడు. ‘శ్రమను చౌకగా అమ్ముకునే / అజ్ఞానపు చీకట్లో/తిరుగుతున్న వాళ్ళం / మా పాదాలు నడుస్తున్నయి/ వందల మైళ్ళు / పదవుల కోసం కాదు /జానెడు పొట్టకోసం’ అహా చూడండి, ఆ దయార్ద్ర హృదయుడు, మానవతకు కరుణరస పోషణ జేస్తుండు. స్వతంత్ర ఫలాలు ఎవరికందాలో వారికందుతలేవని చెపుతాడిలా, ‘‘డెబ్బై ఏళ్ళ వయస్సు ప్రజాస్వామ్యం / నిస్సహాయంగా చూస్తుంది / తాను బతికే ఉన్నానా అని’ అంటాడు. తాను బక్క చిక్కినా, జనాలకు కడుపు నింపుటలో ఏ మాత్రం శ్రమకు వెనుకంజ వేయని రైతుల శ్రమను దోచి, కార్పోరేట్లను కాచె నల్లచట్టాలకు వ్యతిరేకంగా కర్షకుల పోరాటానికి మద్దతిస్తూ ఈ విధంగా అంటాడు. ‘ఢిల్లీ నగర వీధుల్లో / నిరసన మంటలవుతున్నరు / చలినే వణికిస్తున్న / నిరాయుధులు వాళ్ళు / మళ్ళీ మళ్ళీ చెప్తున్నా / హలం పట్టి / అన్నం పెట్టే చేతులు అవి రైతు ఉసురు తియ్యకండి / మంటలయి అంటుకుంటరు’

రెక్కాడితేనే గాని డొక్కాడని దుఃఖ పరిస్థితి

చెమటోడ్చి కన్న కష్టం జేసినా, గద్దోలె తన్నుకపోయే అగ్రకుల భూస్వాములు రాత్రి మూడు గంటలకు శోకపు కన్నీటి యేరు పుట్టి, దానికి పిల్లల ఏడుపుల ఉప నదులు తోడై పెద్ద నదై పారి తెల్లారే సరికి సముద్రుని చేరే కదగొట్టు బిడ్డడి బాధ మూడు దిక్కులా ఇలా ఉంటే, ఇంకోవైపు తన మతం వారే అంటరానోడని చూపే అస్పృశ్యత గుండెను కెలిగించినట్లుగ తీవ్రంగా బాధపెడుతున్నదని తెలిపారిలా కవీశ్వరుడు ఆనంద్. ‘నా దేశం చుట్టూ / మూడు వైపులా సముద్రాలున్నట్టే / నా చుట్టూ అంతే / నేనో ద్వీపకల్పాన్ని తూర్పున దుఃఖ సముద్రం / పడమర ఘర్మ సముద్రం / దక్షిణాన కన్నీటి సముద్రం/ ఉత్తరాన హిమాలయాలున్నట్లే / నాకు ఉత్తరాన ఎత్తైన మత పర్వతాలున్నయి’ చదువు గంధమబ్బని యువతను, బీరు, బిర్యానిలకు,సుఖ లాలసకు బానిసలుగా మారుస్తారు బడా నాయకులు. వారిని చీకటిలుంచి, విజ్ఞాన వెలుతురును అసహ్యించుకునేల తయారుచేసి, సంఘవిద్రోహక శక్తులుగా మార్చుతూ..ఓట్ల చేపలనుపట్టే గాలాలకు ఎరలుగా మార్చేస్తుంటరని 'అదేమిటో విచిత్రం' అనే కవితలో ఇలా ఎలుగెత్తిచాటారు.

రవిగాంచనిది, ఈ కవిగాంచి

‘కుక్కపిల్ల, సబ్బుబిల్ల, అగ్గిపుల్ల కవితకర్హత కానిదేది’ అని శ్రీ శ్రీ అన్నట్లు టోని గురించి కూడ ఆర్ద్రమైన కవితలను వెలువరించారు. వాట్సాప్ గురించి, తెలంగాణ సమస్యను, కన్నీరవుతున్న వాక్యం వంటి సందేశాత్మక కవనాలను రాశారు. అందరికి చల్లని వెన్నెలను పంచే చందమామ లాంటి మేనమామ కాలుకు గాయమైతే, మేనల్లుడు స్పందించిన తీరు హృద్యమైన కృతజ్ఞతలను 'మోకరిల్లుతుంది', 'గాయాల కాలం' 'ఆనంద ప్రపంచంలోకి' వంటి చక్కని కవితల ద్వారా తెలియజేశారు. 'మా ఇంటి సూర్యుడు', 'నాన్న ప్రేమ పూలను వర్షంచాడు' వంటి కవితలను నాన్నపై గల ప్రేమను చాటుతున్నాయి. ఈ గురువు ఓ తరువు,ఆర్ద్రత గల కృపాసాగరుడు, జాలి హృదయ కోవిదుడు, మానవతకు మకుటంలేని మహారాజు యని తన కాలస్పర్శను చదివిన వారికి ఇట్టే తెలిసిపోతుంది. ఇలా పెరమాళ్ల ఆనంద్ వ్యక్తిత్వం తెలుసుకోవాలనుకుంటే ఈ సంపుటిలోని కవితలను చదివి తీరాల్సిందే.

(సమీక్షకులు తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ జూ. కళాశాల నాగార్జునసాగర్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ ‘ఓపెన్ వాయిస్’కు, సాహిత్య పేజీ ‘బహుళ’కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com



మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతుల సత్యనారాయణ వ్రత పూజ

- రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి పూజా కార్యక్రమం

ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 16 : హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రత పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమానికి మహిళలు, పార్టీ కార్యకర్తలు, నియోజకవర్గం ప్రజలు భారీగా హాజరైనారు. రాష్ట్రంలోని ప్రజల సుభిక్షంగా ఉండాలని, సమృద్ధిగా వర్షాలు పడి, పాడి, పంటలు పుష్కలంగా పండాలని మంత్రి దంపతులు వేడుకున్నారు. అలాగే ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా కొనసాగాలని ప్రత్యేకంగా ప్రార్థించారు.





తెలంగాణ క్రీడా పాఠశాల ప్రారంభం

- యువజన, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 16: హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలంగాణ క్రీడా పాఠశాలను ఆదివారం రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన శాఖ క్రీడల మత్స్యశాఖ మాత్యులు వాకిటి శ్రీహరి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజ్ , తెలంగాణ రాష్ట్ర క్రీడల ప్రాధికారిక సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ సాయికుమార్, రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా బొ(రాజ్ఞానేశ్వర్, రాష్ట్ర క్రీడల శాఖ విసి అండ్ ఎం డి సుమబాల, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, జిడబ్ల్యూ ఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజిజ్ ఖాన్, ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.

రాష్ట్రం లోని మత్స్యకారులకు ఆర్థిక భరోసా



ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్16: రాష్ట్రం లో మత్స్య పరిశ్రమ పై ఆధారపడ్డ మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి,ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య,డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మత్స్యకారులకు 100 శాతం రాయితీతో చేపలు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ధర్మసాగర్ రిజర్వాయర్ లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి, రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ సాయికుమార్, రాష్ట్ర తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్‌గా బొ(రాజ్ఞానేశ్వర్,తెలంగాణ రాష్ట్ర క్రీడల ప్రాధికారిక సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, రాష్ట్ర మత్స శాఖ సంచాలకులు నిఖిల, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, లతో కలసి మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై 12 లక్షల చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



పోలీస్ సిబ్బందికి టీ కాఫీలు అందించిన ఎస్పీ

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 16 : చలిలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బందికి కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర స్వయంగా కాఫీ టీలు అందించారు. శనివారం అర్ధరాత్రి 2 గం ల తర్వాత సిరిసిల్ల రోడ్, ఎల్లారెడ్డి రోడ్, రామారెడ్డి రోడ్డులో ఎస్పీ రాజేష్ చంద్ర పోలీసుల విధులను తనిఖీ చేశారు. ఈ సమయంలో గడ్డకట్టే చలిలో సైతం విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కష్టాన్ని స్వయంగా చూసి చలించిపోయారు. ఎముకలు కొరికే చలిలో ఉన్న పోలీస్ సిబ్బంది వారు విధుల్లో కష్టాన్ని స్వయంగా గుర్తించారు. ఎస్పీ తన ఇంట్లో టీ, కాఫీ తయారు చేయించి వాటర్ బాటిలతో సహా స్వయంగా అందజేశారు. దాంతో పోలీసులు తమ కష్టాన్ని గుర్తించడమే కాకుండా టీ, కాఫీ, వాటర్ బాటిళ్లు ఎస్పీ స్వయంగా అందజేయడంపై సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.



పట్టణ సమస్యలను

దశలవారీగా పరిష్కారిస్తాం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 16 : ఖానాపూర్ పట్టణాన్ని దశలవారీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించుకొని ముందుకెళ్తున్నానని క ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయా వార్డులలో ఆయన మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వీధులలో సంచరిస్తూ కాలనీవాసులను పలకరిస్తూ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ అంతర్గత శివారు ప్రాంతాల పై సముచిత ప్రాధాన్యత ఇచ్చి మౌలిక వసతులైన సిసి డ్రైన్ రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు తాగునీటి వసతి కల్పనకు కృషి చేయడం జరుగుతుందన్నారు. పారిశుధ్య సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు సంబంధిత విభాగాల వారితో సమీక్ష సమావేశాలు నిర్వహించి పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతున్నదన్నారు. ఎలాంటి సమస్యను ఉన్నతన దృష్టికి నేరుగా తీసుకోరావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఈ సందర్భంగా స్థానికులను కోరారు. ప్రధాన కూడళీలలో ఉన్న ట్రాఫిక్ ఇతర సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి సంబంధిత శాఖల అధికారులకు అప్రమతం చేయడం జరుగుతుందని చెప్పారు. ఆయనతోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం తదితరులు ఉన్నారు.



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసిన ఎమ్మెల్యే

ప్రతిపక్షం, నిర్మల్, నవంబర్ 16: నిర్మల్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరి గారిని మహారాష్ట్ర లోని నాగ్ పూర్ లో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందించారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ గారు ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ గార్లతో కలిసి మహారాష్ట్రలోని నాగ్ పూర్ లో కేంద్రమంత్రి గడ్కరి గారితో తో బేటి అయ్యారు. నిర్మల్ జిల్లాలో రహదారుల అభివృద్ధి అంశంపై కేంద్ర మంత్రితో చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో పలు సమస్యలపై సైతం మంత్రి గారితో చర్చించడం జరిగిందని అన్నారు. రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు విషయంలో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించడం జరిగిందని, బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.



కళాకార్ బాల రత్న అవార్డు 2025కు ఇందూరు నృత్య కళాకారిణి తేలి విభ శ్రీ ఎంపిక

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 16 : హైదరాబాద్ బిర్లా ఆడిటోరియం లో ఆదివారం జరిగిన కళాకార్ బాల రత్న అవార్డు 2025 కు ఇందూరు నృత్య కళాకారిణి తేలి విభ శ్రీ (కామాఖ్య) ఎంపికైంది. తన దైన శైలి తో శాస్త్రీయ నృత్యం, వెస్ట్రన్, ఫ్లోక్ తో పాటు, పలు టీవీ షోలు, పలు సినిమా చైల్డ్ ఆర్టిస్ట్ గా, యాడ్ షోలు అలాగే ఫ్యాషన్ షోలు ఇచ్చినందుకు గాను మల్టి ఫుల్ టాలెంటెడ్ గర్ల్ "బాలరత్న అవార్డ్ 2025 "ను కెమెరామెన్ సయ్యద్ మీర్, యాక్టర్ ట్వింకిల్ కపూర్ లు ప్రధానం చేశారు. ఈ అవార్డ్ రావడం పట్ల చిన్నతనం నుండి నా వెన్నంటు ఉంటు ప్రోత్సహిస్తున్న తల్లి తండ్రుల కు అంకితమిస్తున్నట్లు విభ శ్రీ భావోగ్వేదం తో తెలిపింది. నన్ను వెస్ట్రన్ డాన్స్ లో పరిపక్వత చేసి ఎన్నో మెరుగులు నేర్పిన నా గురువు పసునూరి వినయ్ కుమార్, శాస్త్రీయ నృత్య గురువు కరణం శ్రీనివాస్ లకు పాదాభి వందనం తెలిపింది. కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు ప్రోత్సాహానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.



శ్రీ మహా అడెల్లి పోచమ్మ ఆలయంలో జిల్లా న్యాయమూర్తులు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 16 : సారంగాపూర్ మండలంలోని శ్రీ మహా అడెల్లి పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాలలో జిల్లా జడ్జి శ్రీవాణి డి ఎల్ ఎస్ ఏ కార్యదర్శి రాధిక, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ భవిష్య లు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు,బాధ్యులు సాధారణ స్వాగతం పలికారు. శ్రీ అడెల్లీ మహాపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వర్ణ ప్రాజెక్టు సందర్శించారు. న్యాయవాదులు లింగా గౌడ్, ఎస్సై శ్రీ కాంత్ ఉన్నారు.



భీమన్న గుట్టను కాపాడాలని ఎంపీ ఈటెల రాజేందర్‌కు వినతి

- నిర్మల్ జిల్లా ముదిరాజ్ కోర్ కమిటీ నాయకులు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 16 : నిర్మల్ జిల్లా కేంద్రంలో అన్యాక్రాంతమవుతున్న చారిత్రాత్మక భీమన్న గుట్టను కాపాడాలని మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ కు ముదిరాజ్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఆకస్మిక పర్యటనలో భాగంగా నిర్మల్ వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్ ను కలిసి ఎన్నో ఏళ్లుగా భీమన్న గుట్టపై పండ్ల చెట్ల పెంపకం చేస్తూ జీవనోపాధి పొందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. భీమన్న గుట్ట వద్ద ముదిరాజుల ఆరాధ్య దైవం అయిన ముదిరాజులు కొలిచే భీమన్న దేవుడి గుడి ఉన్నదని తెలిపారు. ముదిరాజుల సెంటిమెంట్ కు సంబంధించిన విషయం కాబట్టి భీమన్న గుట్ట ఆక్రమణకు గురవుతోందని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ముదిరాజ్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు వాపోయారు. ఈ సందర్భంగా తమకు న్యాయం చేయాలని కోరారు సంబంధిత మంత్రి తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఈటెల భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ముదిరాజ్ కోర్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ట్రాన్స్ఫార్మర్ దొంగల ముఠా అరెస్ట్

- 8 మంది అరెస్టు



ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 16 : అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ దోపిడీ ముఠాను పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. వీరి నుంచి 40 కిలోల కాపర్ కాయిల్స్, రూ.5.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత సంవత్సరం కాలం నుండి నిజామాబాద్ జిల్లాలోని ఇందలవాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, మెండోరా, ముప్కాల్, మోర్తాడ్, ముగ్పాల్, బోధన్ టౌన్, బోధన్ రూరల్, నవీపేట్, వర్ని, మండలాల్లో ఈ ముఠా రెక్కిలు నిర్వహిస్తూ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసంచేసి అందులోని కాపర్ కాయిల్స్ దొంగలించారు. అంతరాష్ట్ర దొంగల ముఠా లోని ఏడుగురు సభ్యులలో నుండి ఐదుగురిని శనివారం అరెస్టు చేశారు. దొంగలించిన కాపర్ కాయిల్స్ ను కొన్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు నిజామాబాద్ జిల్లాలోని పై పోలీస్ స్టేషన్ పరిధిలలో 101 ట్రాన్స్ ఫార్మర్ లను పగులగొట్టి అందులో వున్న కాపర్ కాయిల్స్ ను దొంగతనలకు పాల్పడగా 44 కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు. ఈ ముఠాను పట్టుకునేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్ ఏసీపీ రాజ వెంకట రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ టీం లు ఇందలవాయి మండల పరిధిలో గన్నారం వద్ద వాహనాలను తనికి చేస్తుండగా అనుమానం వచ్చి నిందితులను పట్టు కోవడం జరిగిందన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో తుంబారె సుధాకర్ ఏ 1, హర్బీర్ శర్మ ఏ 2, అలీ మహమ్మద్ ఏ 3, యడాల వెంకటేశ్వర్లు ఏ 4, శానపల్లి రవీందర్ @మాదవ రెడ్డి ఏ 5, లింగప్ప ఏ 8, గాజుల శ్రీ శైలం ఏ 9, మహమ్మద్ హైదర్ అలీ ఏ 10, పరారీలో అనిల్ ఏ6, వలీ ఏ 7 ఉన్నట్లు సిపి వెల్లడించారు. ఈ కేసు లకు సంబంధించి పోలీసులు పట్టుకున్న వారి నుంచి 40 కేజీల కాపర్ కాయిల్స్, రూ.5 లక్షల 50 వేల నగదు స్వాదినం చేసుకొని వారిని అరెస్ట్ చేసి కోర్ట్ ముందు హాజరుపరచడం జరుగుతుందని తెలిపారు. అలాగే రెండు స్కూటీ లు, 6 సెల్ ఫోన్ లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసుని చేదించిన ఏసిపి డిచ్ పల్లి సీఐ కే వినోద్, ఇందల్వాయి ఎస్సై సందీప్, డిచ్ పల్లి ఎస్సై షరీఫ్, జక్రాన్ పల్లి ఎస్సై మహేష్, హెడ్ కానిస్టేబుల్ కిరణ్ గౌడ్, కానిస్టేబుళ్లు ప్రశాంత్, సందీప్, కిషోర్ కుమార్, సుజిత్, నవీన్ సర్దార్ లను సీపీ సాయి చైతన్య అభినందించారు.



వైజాగ్ స్టీల్ ప్లాంట్‌పై సీఎం చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. కార్మికులు పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నారనడం దారుణం. ఆయన మాటలు తెలుగు జాతిని అవమానించేలా ఉన్నాయి. వెంటనే ఆ వ్యాఖ్యలను చంద్రబాబు వెనక్కు తీసుకోవాలి. ఆర్సెలార్ మిట్టల్‌కు క్యాప్టివ్ మైన్స్ అడుగుతారు కానీ, విశాఖ స్టీలుకు ఎందుకు అడగరు.

- సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

ప్రాంతీయం

ముగ్గురు అసిస్టెంట్ లైన్‌మెన్లు సస్పెన్షన్

- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

ప్రతిపక్షం, హనుమకొండ, 16: జగిత్యాల సర్కిల్ టౌన్ 1 సెక్షన్ కార్యాలయ ఓ &యం స్టాఫ్ రూమ్ లో శనివారం ముగ్గురు అసిస్టెంట్ లైన్ మెన్లు ఏ. ప్రభాకర్ , జి. బాలకృష్ణ , వి. రాజశేఖర్ మందు పార్టీ చేసుకునట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయినందున వెంటనే ఆ ముగ్గురు అసిస్టెంట్ లైన్ మెన్లను సస్పెండ్ చేయడం జరిగిందని జగిత్యాల డివిజినల్ ఇంజనీర్ గంగారాం తెలిపారు.పై విషయంపై సంస్థ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి తీవ్రంగా స్పందిస్తూ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 17 సర్కిళ్లలోని అన్ని సబ్‌స్టేషన్‌లు, విద్యుత్ సంస్థ కార్యాలయాలు లేదా సంస్థ ప్రాంగణంలో విధులు నిర్వహించే ప్రదేశలలో అనైతిక కార్యకలాపాలు , క్రమశిక్షణా విరుద్ధ చర్యలకు పాల్పడితే ఎటువంటి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని ఉద్యోగస్తులకు , సిబ్బందికి హెచ్చరిస్తున్నామని సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు . ఒక వేళా విధులకు సంబంధించి ఏవైనా ఉద్యోగి ప్రవర్తనా నియమాలను ఉల్లంఘించి అనైతిక చర్యలకు పాల్పడిన పక్షంలో విధుల నుండి తక్షణమే తొలగిస్తామని గట్టిగా హెచ్చరించారు . ఇందుకు సంబంధించి హెచ్‌ఆర్డీ విభాగం నుండి అడ్వైజరీ మెమోను జారీచేసినట్లు తెలియజేశారు. అందరూ విధుల పట్ల అత్యంత బాధ్యతతో వ్యవహరించి, సంస్థ ప్రతిష్టను కాపాడాలని వినియోగదారులకు మెరుగైన , నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో భాగస్వామ్యులు కావాలని కోరారు.

ఎర్రగట్టు స్వామి భూములు అన్యాక్రాంతం!

ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 16: హనుమకొండ జిల్లా లో 66 వ డివిజన్ లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయినా శ్రీ ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి కి చెందిన ఆలయ భూములలో సుమారు 1000 గజలలో హైదరాబాద్ కి చెందిన ఒక గుర్తు తెలియని వ్యక్తి శనివారం అర్ధరాత్రి ప్రహరీ గోడ కోసం మార్కింగ్ చేయడం చర్చనీయంగా మారింది.. ఈ సంఘటన ఆదివారం రోజు ఉదయం స్థానికుల కంట పండగ కొంత మంది స్థానికులు ఆరా తీయగా ప్రముఖ రాజకీయ నాయకుని హస్తం ఉన్నట్లుగా భావిస్తున్నారు.. ఇప్పటికే గత కొంతకాలం గా ఎర్రగట్టు స్వామి భూమలు అన్యాక్రాంతం కావడం ప్రజల్ని విస్మయ్యపారుస్తుంది.ఆదివారం సాయంత్రం కొంత మంది స్థానిక నాయకులు భూమిని ఆక్రమించిన సదరు వ్యక్తిని ప్రశ్నించగా అయన 100 కి కాల్ చేసి పోలీసులను రప్పించారు. రాబోయే రోజుల్లో దేవాదాయ శాఖ ఈ భూమల విషమై ఎం చేస్తుందో చూడాలి. ఈ భూమికి సంబందించి విలువ సుమారు 50 కోట్ల కి పైగా ఉంటుంది అని అనుకుంటున్నారు.



నరేంద్ర మోదీ నాయకత్వంతోనే
దేశంలో అభివృద్ధి సాధ్యం

- బొల్లారంలో బీజేపీ పార్టీలో భారీ చేరిక
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 16 : భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లోకి యువకులు పెద్ద ఎత్తున చేరడానికి, దేశ ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న అభివృద్ధి, స్థానికంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే ప్రధాన కారణం అని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు.ఆదివారం బొల్లారం మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా హాజరైన సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పార్టీ కండువా కప్పి కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికలో భాగంగా 13వ వార్డు, పాతబస్తీ, పెద్దమ్మ గుడి ప్రాంతానికి చెందిన సుమారు 30 మంది యువకులు,14వ వార్డులోని సమీర్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువకులు పార్టీ సిద్ధాంతాలకు, నాయకత్వానికి ఆకర్షితులై కిషోర్ చారి నేతృత్వంలో వచ్చిన ఈ యువత బీజేపీలో చేరారు .ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భరత్ చారి, రవీందర్ రెడ్డి,జనరల్ సెక్రెటరీ అఖిల్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు అరుణ్,బన్నీ, విష్ణు చారి తదితరులు పాల్గొన్నారు.



ఫార్మ్ హౌస్ ప్రారంభించిన స్పీకర్

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 16 : మొయినాబాద్ మండలం చిలుకూరి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన సిరి ఫామ్ హౌస్ ను తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు , మాజీ ప్రజాప్రతినిధులు , పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూతన వధువు పెళ్లికి పుస్తె మెట్టలు అందజేత

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 16: గ్రామ ప్రజల సంతోషమే తన సంతోషమని మండల ఎంపీటీసీల ఫోరం తాజా మాజీ అధ్యక్షులు , మోర శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోర శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఎర్ర జంగయ్య కుమార్తె నందిని వివాహానికి మోర శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... గ్రామంలో ఉన్న ఆడబిడ్డలు తమ తోబుట్టువులని వారికి సేవచేయడంలో ఉన్న ఆనందం మరోకటి లేదని అన్నారు. గ్రామంలో ఏ సమస్య తలెత్తిన తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారమే దిశగా అడుగులు వేస్తానని తెలిపారు. సేవ చేయడంలో ఉన్న తృప్తి మరి దేనిలో లేదన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, విజయలక్ష్మి ,కావలి ప్రవీణ్, ఎర్ర యాదయ్య తదితరులు ఉన్నారు.





ఎంఐఎం అధినేత ఓవైసీ ని కలిసిన నవీన్ యాదవ్

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 16: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎంఐఎం పార్టీ నవీన్ యాదవ్ కు పూర్తి స్థాయి మద్దతు ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే నవీన్ యాదవ్. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ , ఎన్నికల విజయంలో ఎంఐఎంఐఎం పార్టీ పోషించిన కీలక పాత్రను గుర్తుచేసుకుంటూ. అసద్దుదిన్ ఓవైసీ కి పుష్పగుచ్చం అందించి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీ హిల్స్ ప్రజలకు , మైనార్టీల సంక్షేమాలకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఈ సందర్భంగా నవీన్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు. కార్యకర్తలు. తదితరులు పాల్గొన్నారు.





అట్టహాసంగా ప్రారంభమైన
జాతీయ స్థాయి స్ప్రింట్ రేస్ పోటీలు

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 16: శామీర్‌పేట్ లోని లియోనియా రిసార్ట్‌స్‌లో జాతీయ స్థాయి స్ప్రింట్ రేస్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాస్టర్ గ్రేడ్ రేసింగ్ లీగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో అండర్18 ఇంజినీరింగ్ విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొంటున్నట్లు మాస్టర్ గ్రేడ్ రేసింగ్ సంస్థ వ్యవస్థాపకుడు అఖిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో రేసింగ్ పట్ల పెరుగుతున్న ఆసక్తి, టెక్నికల్ స్కిల్స్ అభివృద్ధికి ఈ లీగ్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ వేదిక ఎంతో పెద్ద అవకాశమని తెలిపారు. పోటీలలో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేస్తూ, ప్రతి రేసర్‌కు అవసరమైన మార్గదర్శకాలు అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి వివిధ కేటగిరీల్లో నిర్వహించిన రేసులు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడా ప్రముఖులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో పాటు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



"విమార్ట్" ప్రారంభం

- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రాజనర్సింహ

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 16: సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో నూతనంగా అందుబాటులోకి తెస్తున్న "విమార్ట్"ను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం ప్రారంభించారు. టీజీఐఐసీ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మార్ట్ ను సందర్శించారు. యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. విమార్ట్ విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. ఈ రిటైల్ మార్ట్ లో ఇంటి అవసరాలకు కావాల్సిన అన్నివస్తువులు అత్యంత నాణ్యంగా, అతి తక్కువ ధరలకే లభిస్తాయని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జూలకంటి ఆంజనేయులుతో పాటు బూరుగడ్డ నగేష్ కురుమ, తాటిపల్లి పాండు, గోరుగంటి రమేష్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.



పార్కుల అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్

ప్రతిపక్షం, ఉప్పల్, నవంబర్ 16 : ఉప్పల్ నియోజకవర్గం లోని చిల్కానగర్ డివిజన్లోని బాలాజీ ఎంక్లేవ్ సీనియర్ సిటిజన్స్ పార్క్ లో, ఫ్రీడమ్ పార్కులో, నార్త్ కళ్యాణ్ పూరి పార్కులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను హార్టికల్చర్ విభాగమ అధికారులతో కలిసి పర్యవేక్షించిన చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ డివిజన్లోని బాలాజీ ఎంక్లేవ్ ఫ్రీడమ్ పార్కులో గజబు చుట్టూ ఫ్లోరింగ్ పనులను, ఫ్రీడమ్ పార్కులో నూతన బోర్ ఏర్పాటు కోసం పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేసి ప్రజలకు వీలైనంత త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని జిహెచ్ఎంసి హార్టికల్చర్ విభాగం అధికారులను ఆదేశించడం జరిగింది. నార్త్ కళ్యాణ్ పూరి లోని పార్కులో స్ట్రీట్ లైట్స్ కి అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను అన్నిటిని వెంటనే తొలగించే విధంగా అన్ని చర్యలు చేపట్టాలని పార్కులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తానని తెలపడం జరిగింది. కార్యక్రమంలో బాలాజీ ఎంక్లేవ్ అసోసియేషన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి ,ఓంకార్ సింగ్, వేణు గోపాల్ రెడ్డి, హార్టికల్చర్ విభాగమ అధికారులు బాలు, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఎద్దుల కొండల్ రెడ్డి, కోకొండ, ముద్దం శ్రీనివాస్ యాదవ్ ఫోటో బాలు,జగన్ శ్యామ్ ,బంటి గౌడ్ తదితరులు పాల్గొన్నారు

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జాతీయ పత్రికా దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, ప్రతిపక్షం, నవంబర్ 16: బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జాతీయ పత్రికా దినోత్సవం ను రాష్ట్రీయ పత్రికా కార్మికుల మహాసంఘం (ఆర్.పి.యం.) ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాసంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పవిత్ర మోహన్ సమంత్ రాయ్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఈ వేడుకను జరుపుకున్నారు.ఈ సందర్భంగా జర్నలిజాన్ని దేశంలోని నాలుగో స్తంభంగా అధికారికంగా గుర్తించాలని కోరారు. ప్రజలకు నిజాలను అందించేందుకు ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. విధుల్లో బెదిరింపులు, దాడులు, ఇబ్బందులు ఎదురైనప్పుడు జర్నలిస్టులకు రాష్ట్రీయ పత్రికాకార్మికుల మహాసంఘం (ఆర్.పి.యం.) అండగా ఉంటుందని తెలిపారు.జర్నలిస్టుల కోసం ఆరోగ్య సేవలు, వైద్య సదుపాయాలు, గృహ వసతి వంటి ముఖ్య సంక్షేమ పథకాల కోసం మహాసంఘం రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల వద్ద నిరంతరం పోరాడుతున్నట్లు చెప్పారు. జర్నలిస్టులందరూ ఐక్యతగా ఉండి, సమష్టిగా పోరాడాలి అని పిలుపునిచ్చారు.



అదనంగా, నేషనల్ మీడియా కాన్ఫరెన్స్ మరియు ఐ ఎఫ్ ఎం ఎస్ (ఇండియన్ ఫెడరేషన్ ఫర్ మీడియం & స్మాల్ న్యూస్‌పేపర్స్ ఆర్గనైజేషన్) ప్రతి రాష్ట్రంలో చురుకుగా పనిచేస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని రాష్ట్రీయ పత్రికాకార్మికుల మహాసంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ బి. శ్రీకాంత్ లాల్ సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ, నరేష్, రాజేశ్ బడోని, ఆరోహి రావత్, అన్వర్, నరేష్‌కుమార్, జగదీష్, శ్రీనివాస్, పురుషోత్తమ్, రాకేష్, అంజాద్, వీర శేకర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



టెస్టుల్లో ఆడాలంటే స్కిల్‌తో పాటు మెంటల్ టఫ్‌నెస్ ఉండాలి. సౌతాఫ్రికాతో తొలి టెస్టులో 124 ఛేజబుల్ టార్గెటే. పిచ్ ఆడేందుకు వీలుగానే ఉంది. ఇలాంటి పిచ్‌పై ఆడాలంటే టెక్నిక్, టెంపెరమెంట్ ఉండాలి. ఫాస్ట్ బౌలర్లకే ఎక్కువ వికెట్లు పడ్డాయి. మేం అడిగిన పిచ్‌నే క్యూరేటర్ తయారు చేశారు. బాగా ఆడనప్పుడు ఇలాగే జరుగుతుంది.
- టీమిండియా హెడ్ కోచ్ గంభీర్

ఘనంగా పెందోట పురస్కార ప్రధాన సభ



ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 16: వాణి సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో జరిగిన పెందోట పురస్కారాల ప్రధాన సభ , 2025 బాలల కథల పోటీల బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నాలుగు పుస్తకాలు కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నలవోలు నరసింహారెడ్డి (తెలుగు కళాపీఠం అధ్యక్షులు, హైదరాబాద్), గరిపెల్లి అశోక్, డాక్టర్ వాసరవేని పరుశరాములు, ఎన్నవెల్లి రాజమౌళి, యోగానంద స్వామి, భైతి దుర్గయ్య, గుండ్ల రాజు , సాదత్ అలి, గడ్డం బాలకృష్ణ పాల్గొన్నారు. పురస్కారాలు ప్రదానం చేస్తూ నలవోలు నరసింహారెడ్డి మాట్లాడుతూ పురస్కారాలు ఇవ్వడం, బాలల కథా పోటీలను ప్రోత్సహించడం సాహిత్యాభివృద్ధికి ఎంతో ముఖ్యం అని తెలిపారు. సభాధ్యక్షులు పెందోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సాహిత్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని వాణి సాహిత్య పరిషత్, పెందోట బాలసాహిత్య పీఠం సంయుక్తంగా నిర్వహించాయి. కథా చంద్రిక బాల సాహిత్య కథల పుస్తకానికి 'పెందోట' పురస్కారం ఖమ్మం లోని ఎన్ఎస్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని చంద్రిక రాసిన 'కదా చంద్రిక' బాలల కథల పుస్తకానికి శ్రీవాణి సాహిత్య పరిషత్తు పెందోట బాలసాహిత్య పీఠం సిద్దిపేట వారు పురస్కారం అందించారు. బాల సాహిత్య సమ్మేళనంలో పెందోట సాహిత్య పీఠం వారు చంద్రిక కి అవార్డుతో పాటు నగదు బహుమతి అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు పెందోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చంద్రిక వాస్తవానికి దగ్గరగా, చేయి తిరిగిన పెద్దలు రాసినట్లుగానే కథలు అద్భుతంగా రాసిందని కొనియాడారు. ముఖ్య అతిథి గరిపల్లి అశోక్ , వాసర వేణి పరశురాములు మాట్లాడుతూ చిన్నారి చంద్రిక రాసిన కథలు చాలా అద్భుతంగా ఉన్నాయని కొని యాడారు. భవిష్యత్తులో మరిన్ని కథలు రాసి సాహితి చరిత్రలో చంద్రిక తన పేరును లిఖించుకోవాలని ఆకాంక్షించారు. కథలు రాయడానికి ఎంతగానో ప్రోత్సహించిన చంద్రిక గురువు కోంద్రు బ్రహ్మంని ప్రత్యేకంగా అభినందించారు. చంద్రికకు పురస్కారం రావడం ఖమ్మం జిల్లాకు ఎంతో గర్వకారణమని ఖమ్మం జిల్లా బాలసాహితీవేత్తలు , సాహిత్య ప్రియులు పాఠశాల ఉపాధ్యాయులు కొని ఆడారు. ప్రధానోపాధ్యాయులు దుర్గా భవాని చంద్రికను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాల సాహిత్య వేదిక కన్వీనర్, తెలుగు ఉపాధ్యాయులు కోంద్రు బ్రహ్మం, రాధిక, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమాజ శ్రేయస్సుకు పాటు పడాలి

- పట్టణ వైశ్య సంఘానికి సంపూర్ణ సహకారం ఉంటుంది
- పట్టణ వైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని అభినందించిన హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 16: సిద్దిపేట పట్టణ వైశ్య సంఘం నూతన కార్యవర్గం సభ్యులు సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని ఏళ్ల తరువాత పట్టణ వైశ్య సంఘం కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం సమాజానికి కొత్త ఉత్సాహాన్ని ఇవ్వడమని, ఈ కొత్త కార్యవర్గం సమాజ శ్రేయస్సు కు మంచి కార్యక్రమాలు చేసి వైశ్య సంఘం అభివృద్ధి కు పాటు పడాలని అందుకు నా సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ సమాజానికి ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అభినందిస్తు వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షులు నేతి కైలాసం, సంఘం నాయకులు అంబటి భాస్కర్, పప్పు రవి తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న ఆలయం కిటకిట

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 16: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆదివారం కొమురవెల్లి మల్లన్న ఆలయంలో కార్తీకమాసంను పురస్కరించుకుని శనివారం నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు దేవస్థానం సత్రాలు, ప్రయివేటు గదులలో రాత్రి బసచేసి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున కోనేరులో తలారు స్నానాలు ఆచరించి ఆదివారం శ్రీ మల్లికార్జున స్వామి ని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి భక్తులు పట్నం, అభిషేకం, దీపాలు వెలిగించుట, అర్చన, నిత్యాకల్యాణం, బోనం, తిరుగుడు కోడె, కేశకండన, గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టి భక్తులు తదితర మొక్కలను చెల్లించుకున్నారు. అనంతరం మల్లన్న గుట్టపైన కొలువైవున్న శ్రీ రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లను దర్శించుకొని బోనాలు సమర్పించారు.



మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి

- యూనియన్ రాష్ట్ర కోశాధికారి అది రంగన్న

ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 16: మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికుల బిల్లులు వెంటనే చెల్లించాలని యూనియన్ రాష్ట్ర కోశాధికారి అది రంగన్న అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు గత పది నెలలుగా వేతనాలు, బిల్లులు చెల్లించడం లేదని, ప్రభుత్వం ఇచ్చే బడ్జెట్ కి రెండు గుడ్లు కూడా రావడం లేదని అన్నారు. పది నెలల నుండి బిల్లులు పెండింగ్లో ఉంటే కార్మికులు ఎంతకాలం అప్పు చేసి పెడతారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చాలాసార్లు కలెక్టర్, డీఈఓ లకు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదీన చలో ఎడ్యుకేషనల్ డైరెక్టర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు యాదమ్మ, ప్రమీల, ఇందిరమ్మ, భారతమ్మ, ఉమారాణి, అనిత, భవాని తదితరులు పాల్గొన్నారు.



భగవాన్ సత్యసాయి శతవర్ష జయంతి

- వేడుకలకు హరీష్ రావుకు ఆహ్వానం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 16: భగవాన్ సత్య సాయి బాబా శత వర్ష జయంతి సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావుకు సిద్దిపేట సత్య సాయి బాబా దేవాలయ వారు ఆహ్వానం పలికారు. ఈ నెల 19 నుండి 23 వరకు జరిగే శత వర్ష జయంతి వేడుకలు సిద్దిపేట సత్య సాయి బాబా దేవాలయం ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు రావాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికని, స్వామి ప్రసాదాన్ని హరీష్ రావు కు అందజేశారు.



ఏడుపాయలలో భక్తుల సందడి

- దుర్గమ్మ నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 16: పవిత్ర పుణ్య క్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాత సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఏడుపాయలకు చేరుకొని దుర్గామాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఓడి బియ్యం కుంకుమార్చనలు, తల నీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు .ఈ సందర్భంగా వేద పండితులు పార్థివ్ శర్మ, రాము, నాగరాజు, రాజశేఖర్ శర్మ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏడుపాయల ఈవో చంద్రశేఖర్ ఆలయ సిబ్బంది, సూర్య శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, బ్రహ్మచారి, నర్సింలు, వరుణ చారి, నరేష్,మహేష్ తదితరులు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



బాధిత కుటుంబాలకు తిరుపతిరెడ్డి పరామర్శ

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 16 నిజాంపేట మండలంలోని బచ్చురాజు పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ మల్లేశం తండ్రి ఎర్ర మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అదేవిధంగా నస్కల్ కు చెందిన లాలాగౌడ్ విద్యుత్ షాక్ తో ఇటీవల చెందారు. స్థానిక బీఆర్ఎస్ నేతల ద్వారా ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆదివారం బచ్చురాజ్పల్లి, నస్కల్ గ్రామాలకు విచ్చేసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం నగరంలో విద్యుత్ షాక్ గురై చికిత్స పొందుతున్న సురేష్ నాయక్ను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. వీరివెంట పీఏసీఎస్ చైర్మన్ అందె కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మావురం రాజు, నాయకులు ఎల్లమ్ యాదవ్, దుర్గయ్య, లచ్చపేట రాములు, నాగేష్, నరేందర్ నాయక్, సుభాష్ నాయక్, రాజు, మహేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

టెట్ ఉచిత అవగాహన సదస్సు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 16: సిద్దిపేట పట్టణంలోని దీక్ష జూనియర్ కళాశాలలో ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్పైస్ సక్సెస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని డైట్, బీఈడీ చేసిన అభ్యర్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు సద్వినియోపరుచుకోవాలని కోరారు. త్వరలో డైట్, బీఎడ్ అభ్యర్థులతో పాటు ప్రభుత్వ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా టెట్ క్లాసులు ప్రారంభిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు:9440005030, 9703113448 లను సంప్రదించాలన్నారు.



కార్మిక వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటం

- నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల ను నిలబెట్టుకోవాలి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 16: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వర్గ వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో రాజలేని పోరాటాలను నిర్వహిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకొని వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఆదివారం రోజున సీఐటీయూ సిద్దిపేట 4వ మహాసభ ప్రారంభ సూచికగా సిద్దిపేట నుండి ప్రదర్శన ర్యాలీ కొత్త బస్టాండులోని కొండ భూదేవి ఫంక్షన్ హాల్ లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సంద బోయిన ఎల్లయ్య అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ బహిరంగ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చుక్క రాములు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటివరకు అమలులో ఉన్న 29 కార్మిక చట్టాలను రద్దుపరిచి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం మూలంగా కార్మికుల్ని కట్టు బానిసలుగా మార్చే ప్రయత్నం చేసిందని, ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగించి 10,12 గంటల వరకు పరిశ్రమల్లో పనిచేయాలని చట్టంలో వచ్చిన మార్పు కారణంగా శ్రమదోపిడికి గురి అవుతున్నారని అన్నారు. రాబోయే కాలంలో రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీల అమలు కోసం ఉద్యమిస్తామని ఆయన తెలిపారు. బహిరంగ సభలో జిల్లా మహాసభ ఆహ్వాన సంఘ చైర్మన్ సింగిరెడ్డి చంద్రారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ , రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆముదాల మల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల్ స్వామి, జిల్లా కోశాధికారి జి భాస్కర్ ఉపాధ్యక్షులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, ఎం పద్మ, బండ్ల స్వామి, కాట మధు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, తునికి మహేష్ ,ఇప్పకాల శోభ, జిల్లా కమిటీ సభ్యులు మామిడాల కనకయ్య అమ్ముల బాలార్సయ్య మండల కన్వీనర్లు హమాలీ, భవన, ఆశ, అంగన్వాడి, మధ్యాహ్న భోజనం తదితర యూనియన్ భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కవితపై అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

- తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు చంద్రశేఖర్



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 16:- తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం టీఎన్జీవో భవన్లో మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా పోరాటం చేయడమే జనం బాట లక్ష్యమని, అందులో భాగంగానే జిల్లాలో నర్సాపూర్ నియోజకవర్గంలోని రెడ్డిపల్లి గ్రామం సందర్శించడం జరిగిందని, ఆ గ్రామంలో చాలామంది రైతుల భూములు కోల్పోవడం జరిగిందని ముఖ్యంగా కాళేశ్వరం, త్రిబుల్ ఆర్ రైల్వే లైన్ కోసం రైతులు 59 మంది రైతుల వద్ద నుండి భూములు కోల్పోవడం జరుగుతుందని దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆ గ్రామాన్ని కవిత సందర్శించడం జరిగిందని అన్నారు. రైతులు తెలిపిన వివరాలను మీడియా ముందు పెట్టడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. అక్కడ ప్రజలు రైతులు తెలిపిన వివరాల ప్రకారం మాజీ మంత్రి హరీష్ రావుకు 400ఎకరాలు తో పాటు వివిధ భారత రాష్ట్ర సమితి పార్టీకి చెందిన నాయకుల భూములు ఉండడం మూలంగా, వారి భూములను ఎలాంటి ఇబ్బందులు లేకుండా మామూలు పేద రైతు భూములకు కోల్పోయే విధంగా డిజన్ ఏర్పాటు చేయడం జరిగిందని రైతులు తెలిపిన వివరాలను మీడియా ముందు ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. భారత రాష్ట్ర సమితి నాయకులు మెదక్ లో మీడియా సమావేశంలో కవితపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరైన విధానం కాదని వారు తెలిపారు. నిజానిర్ధారణ చేసుకోకుండా బీఆర్ఎస్నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరైనది కాదని వారు అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ పైన విమర్శలు చేయడం లేదని ఆరోపించడం సరి కాదని వారు తెలిపారు. పాపన్నపేట మండలం నాగ్సన్ పల్లి గ్రామ సమీపంలోని వడ్డెర కాలనీలో 35 మంది ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి వారానికి ఒకసారి భగీరథ నీళ్లు రావడం జరుగుతుందని, ఎవరికి కూడా ఇల్లు లేవని ప్రభుత్వం వెంటనే 35 మందికి ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేయడం జరిగిందని తెలిపారు. ఒకవేళ ప్రభుత్వం చేయని యెడల ఫిబ్రవరి 13న తెలంగాణ జాగృతి సంస్థ ఆధ్వర్యంలో తమ నిరసనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలకు మేలు చేయడం కోసమే కవిత పనిచేస్తున్నారని వారు తెలిపారు. లిక్కర్ స్కీం లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చాలాసార్లు మాట్లాడడం జరిగిందని కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తుందని ఆ రోజే కేసీఆర్ చెప్పారని వారు అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ను అనుగదొక్కడం కోసమే బీజేపీ ప్రభుత్వం ఆరోజు కవితపై లిక్కర్ స్కామ్ ను పెట్టడం జరిగిందని వారు తెలిపారు. మెదక్ జిల్లాలో ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని వాటిని పరిష్కరించే దిశగా తెలంగాణ జాగృతి సంస్థ పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా భారత రాష్ట్ర సమితి నాయకులు వాస్తవాలను గుర్తించాలని అన్నారు. ఈ మీడియా సమావేశంలో తెలంగాణ జాగృతి మెదక్ జిల్లా నాయకులు రమేష్ గౌడ్, విజయ్ కుమార్, నందాల భగవాన్, బాలు, సమీర్, మహిళా నాయకురాలు రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో వ్యక్తిగతంగా నవీన్ యాదవ్‌కు సపోర్టు చేశాం. కానీ కాంగ్రెస్‌కు మద్దతిచ్చినట్లుగా కొందరు అర్థం చేసుకున్నారన్నారు. నియోజకవర్గాన్ని నవీన్ అభివృద్ధి చేస్తారని ఆశిస్తున్నాం. బీఆర్ఎస్‌తో తమకు ఎలాంటి విభేదాలు లేవు. కేసీఆర్ అయినా, తానైనా మా పార్టీలకు మంచి అనిపించేది చేసుకుంటూ వెళ్తాం.

- ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ

ప్రాంతీయం



20 న జిల్లా కబడ్డీ ఎంపికలు

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 16: సిద్ది పేట జిల్లా జూనియర్ (బాలబాలికల), సీనియర్ (మహిళా-పురుషుల) కబడ్డీ ఎంపికలు నవంబర్ 20న ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్ర క్రీడామైదానంలో జరుగనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్ తెలిపారు. జూనియర్ బాలికలు (డిసెంబర్ 29, 2005 తర్వాత జననం - 65 కేజీల లోపు), జూనియర్ బాలురు (జనవరి 18, 2006 తర్వాత జననం - 70 కేజీల లోపు) అర్హులు అన్నారు. ఎంపికైన జట్లు డిసెంబర్‌లో నాగార్జునసాగర్, మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. సీనియర్ మహిళలు 80 కేజీలలోపు, పురుషులు 85 కేజీలలోపు అర్హులు అని ఎంపికైన వారు కరీంనగర్‌లో జరిగే సీనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆధార్, బర్త్ సర్టిఫికెట్, రెండు ఫొటోలతో క్రీడాకారులు హాజరుకావాలని వెల్లడించారు. వివరాలకు శ్రీకాంత్ 9550847409,కరుణాకర్ 9177822113,రాజు -9912585879ఫోన్‌నంబరులను సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులకు ఇబ్బందులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట నవంబర్ 16: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మండిపడ్డారు. చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్నిహరీష్ రావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం ఐదు నుంచి ఆరు లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను మాత్రమే కొనుగోలు చేసిందని, అయితే కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చింది 85 లక్షల మెట్రిక్ టన్నులని గుర్తుచేశారు. ఇప్పటికే కొనుగోలు చేసిన వడ్లకు కూడా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో రైతులు ఆర్థికంగా దెబ్బతింటున్నారని తెలిపారు. ఎమ్మెస్పీ కింద దాదాపు 1200 కోట్ల రూపాయలు, బోనస్ కింద దాదాపు 200 కోట్ల రూపాయలు ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయలేదని అన్నారు. 24 గంటల్లో బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. పోయిన యాసంగి బోనస్ మొత్తాన్ని తక్షణమే విడుదల చేసి, వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చలి పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నందున, వెంటనే మిల్లులతో టై అప్ చేసి వడ్ల కొనుగోలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. మక్క రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారిందని, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6 లక్షల ఎకరాల్లో సాగు చేసిన మక్క కొనుగోలు పనులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని హరీష్ రావు విమర్శించారు. మక్క రైతులకు చెల్లించాల్సిన డబ్బును తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం రైతులను అన్యాయంగా అరిగోస పెడుతోందని హరీష్ రావు ఆరోపించారు. ఎకరానికి కేవలం 7 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేస్తామని కేంద్రం చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. కొన్ని జిల్లాల్లో పత్తి దిగుబడి 11 నుండి 12 క్వింటాళ్లు వచ్చిన నేపథ్యంలో, మిగిలిన పత్తిని రైతులు ఏం చేయాలనే ప్రశ్నను హరీష్ రావు లేవనెత్తారు. ఒకవైపు జిన్నింగ్ మిల్లులు, మరోవైపు సీసీఐ పత్తి కొనుగోలు సరిగా చేయకపోవడం వల్ల రైతులు అప్పులపాలు అవుతున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్న దుర్ఘటనలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోయిన యాసంగిలో వడగండ్ల వాన, ఈ ఏడాది తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదని హరీష్ రావు తెలిపారు. పంటల బీమా ఉంటే రైతులకు ఇబ్బంది లేకుండా డబ్బులు వచ్చేదని చెప్పారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని హరీష్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.





పేద చేనేత కుటుంబాలకు నిత్యవసరాలు అందజేత

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 16: మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిరుపేద చేనేత కార్మికుల కుటుంబాలకు ఆదివారం 15 వేల రూపాయల విలువగల బియ్యం నిత్యవసర సరుకులను పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొల్లిబత్తుల దేవ దాసు అందజేశారు. ఈ సందర్భంగా దేవదాస్ మాట్లాడుతూ మునుముందు పద్మశాలి కుల బంధువులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు, కోశాధికారి దేవసాని హనుమాన్ దాస్, సహాయ కార్యదర్శి పాశికంటి శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా యువజన అధ్యక్షులు గాడిపల్లి అనూప్, జిల్లా ప్రచార కార్యదర్శి గాడిపల్లి బలరాం, రాష్ట్ర యూత్ సహాయ కార్యదర్శి కుడికాల రమేష్ .గజ్వేల్ యువజన అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్ కుమార్, యువజన ప్రధాన కార్యదర్శి అనుమాండ్ల నాగరాజు, యువజన సంఘ ఉపాధ్యక్షులు సబ్బని చంద్రమౌళి, జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్ పద్మశాలి గౌరవ ముఖ్య సలహాదారుడు తల కొక్కుల మధుసూదన్, మంగళ్పల్లి సత్యం, విష్ణు, నర్సింలు, భాస్కర్, ప్రసాద్, నల్ల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నస్వామిని దర్శించుకున్న కలెక్టర్

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 16: కార్తీక మాసంను పురస్కరించుకుని ఆదివారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి కుటుంబ సభ్యులతో జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు, వేద పండితులు కలెక్టర్ కుటుంబానికి ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఆలయంలోకి తీసుకెళ్లి సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో జిల్లా అభివృద్ధి పథంలో అగ్రస్థానంలో నిలవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. వేదపండితులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వచ్చే నెలలో జరిగే శ్రీ మల్లికార్జునస్వామివారి కళ్యాణం మరియు ఉగాది వరకు జరిగే జాతర ఏర్పాట్ల గూర్చి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



మదన్ మోహన్ సేవలు చెరగని ముద్ర వేశాయి

- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు
- దివంగత మాజీ ఎమ్మెల్యే మదన్ మోహన్ విగ్రహ ఆవిష్కరణ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 16: దివంగత మాజీ ఎమ్మెల్యే మదన్ మోహన్ సేవలు సిద్దిపేట చరిత్రలో చెరగని ముద్ర వేశాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని విక్టరీ చౌరస్తా వద్ద గల పార్కులో దివంగత మాజీ ఎమ్మెల్యే ఆనంతుల మదన్ మోహన్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని, మదన్ మోహన్ కుటుంబ సభ్యులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ ఎమ్మెల్సీ పారూఖ్ హుస్సేన్, వరంగల్ మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, ప్రాంతీయ నాయకులు హాజరయ్యారు. మదన్ మోహన్ 93వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ఎలాంటి సదుపాయాలు లేని సమయంలోనే తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపిన వారిలో మదన్ మోహన్ అత్యంత ప్రముఖుడని చెప్పారు. తొలి దశ తెలంగాణ ఉద్యమంలో సిద్దిపేట నుంచి మదన్ మోహన్ గెలుపొందడం, రెండో దశ ఉద్యమం ఎన్నికల్లో కేసీఆర్ గెలిచేలా ప్రజలు తీర్పు ఇవ్వడం సిద్దిపేట రాజకీయ చరిత్రలో ఎంతో విశిష్టమని హరీష్ రావు గుర్తుచేశారు. సిద్దిపేట-కేసీఆర్, సిద్దిపేట-మదన్ మోహన్ సంబంధం ఎంతో ఆత్మీయతతో నిండి ఉందన్నారు. సిద్దిపేటలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలకు మదన్ మోహన్ పేరు పెట్టాలనే అభ్యర్థనతో ముఖ్యమంత్రికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, నాయకులు సంపత్ రెడ్డి, పాల సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద యువతికి పుస్తె మెట్టెలు అందజేత

ప్రతిపక్షం, తొగుట, నవంబర్ 16: తొగుట మండల కేంద్రంలోని తుక్కాపూర్ గ్రామానికీ చెందిన లింగాల స్వామి రాజయ్య ద్వితీయ కుమార్తె అంకిత వివాహానికి పందు ఫౌండేషన్ తరుపున పుస్తె మెట్టెలు అందజేశారు. నిరుపేద కుటుంబాలు, వృద్ధులకు, తల్లితండ్రులు లేని పిల్లలకు గాను సహాయం చేయడంలో పందు ఫౌండేషన్ ముందు ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మెరుగైన ఆరోగ్య సేవలు

- ఆరోగ్య సేవలు పటిష్ట పర్యవేక్షణకు కలెక్టరేట్లో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 16 : జిల్లావ్యాప్తంగా రోగులకు మెరుగైన వైద్య సేవలు దిశగా వైద్యాధికారులు పనిచేస్తున్నారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం శంకరపేట (ఆర్) మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పుస్తకాలు, మందులు, స్టాక్ బోర్డులను నిషితంగా పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. పేదలందరికీ ఉచిత నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, వైద్యాధికారులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరవుతున్నారని, తద్వారా రోగులకు వైద్య సేవలు అందించగలుగుతున్నామన్నారు. జిల్లాలో ఆస్పత్రులు సిబ్బంది మెరుగయ్యాయని తెలిపారు. జిల్లాలో ఉన్న అన్ని ఆసుపత్రులు, వైద్య ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సీసీటీవీ కెమెరాల ద్వారా మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా వైద్య వృత్తి



పేరిట నకిలీలు ఉంటే తట్టరీత్యా శిక్షిస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విజయ శుభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో

ఘనంగా కార్తీక దీపోత్సవం

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, నవంబర్ 16 : సిద్దిపేట పట్టణ హౌసింగ్ బోర్డ్ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో చివరి కార్తీక ఏకాదశి తిథి సందర్భంగా కార్తీక దీపోత్సవం స్త్రీ జాగరణ సమితి అధ్యక్షురాలు లక్కిరెడ్డి విజయ శుభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా హరే కృష్ణ సత్సంగ్ - కంచరి బజార్ శ్రీ రంగదాసు తీర్థ ఇస్కాన్ వారి నేతృత్వంలో భక్తి నిండిన నగర సంకీర్తన నిర్వహించి భక్తులను అలరించారు. తరువాత దేవాలయ ప్రధాన అర్చకులు ప్రసన్న ఆంజనేయులు శాస్త్రోక్తంగా దీపపూజ నిర్వహించారు. కార్తీకమాసంలో ప్రతి నీటి బొట్టులో గంగాదేవి కొలువై ఉంటారని పురాణోక్తి మేరకు స్థానిక గంగాలలో గంగను ఆవాహన చేసి గంగా హారతి నిర్వహించారు.దేవాలయ పారాయణ సమితి సుమన ఆధ్వర్యంలో ప్రత్యేక మంగళహారతులు, గంగా హారతులు నిర్వహించగా, కైలాస విజయ ఆధ్వర్యంలోని గోదా పారాయణ గ్రూపు వారు భజన కార్యక్రమాలతో భక్తిరసాన్ని పంచారు. హరే కృష్ణ సత్సంగ్ వారి సంకీర్తనలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.2014 సంవత్సరం నుంచి స్త్రీ జాగరణ సమితి ఆధ్వర్యంలో నిరంతరంగా కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. అనంతరం స్థానిక బీఆర్ఎస్ పట్టణ నాయకులు కొండం సంపత్ రెడ్డి ప్రసాదం పంపిణీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి పురుమళ్ళ సుజాత, ప్రముఖ నృత్య కళాకారుడు భవాని విజయ్ పాల్గొన్నారు.


పోరాటాల గాథలను శాశ్వతం చేసే రచనల అవసరం

- భావితరాలకు దిక్సూచి.. నాగటి తరం నవల స్ఫూర్తి
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట నవంబర్ 16: పోరాటాల గాథలను శాశ్వతం చేసే రచనల అవసరం సమాజానికి ఎంతో అవసరమని ప్రజా గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. తలవంచుకుని జీవిస్తున్న సమయంలో పోరాట జెండాను ధైర్యంగా ఎగురవేసిన అద్భుత చరిత్ర రేపటి తరానికి అవసరమని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం బందారంలో ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి రచించిన నాగటి తరం నవల ఆవిష్కరణ సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత నందిని సిధారెడ్డి తన తండ్రి జీవన పోరాటాన్ని, సంఘర్షణలను అద్భుతంగా ఈ నవలలో చిత్రించారని చెప్పారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వ్యక్తి చరిత్ర రేపటి తరానికి అవసరమని చెప్పారు. అప్పటి భూపోరాటాలను స్మరించుకోవడం గొప్ప విషయమన్నారు. రజాకార్లు తుపాకులు ఎక్కు పెట్టినా... ప్రాణాలకు తెగించి పీడిత ప్రజల పక్షాన నిలబడి నాగలి పట్టిన ధీరుని చరిత్ర రేపటి పోరాటాలకు అవసరమన్నారు. కుల మతాలకు అతీతంగా, అన్యాయాలకు ఎదురు నిలిచిన వాస్తవ చరిత్రను రచయిత చక్కగా స్పర్శించాడని ప్రశంసించారు. రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తన జీవితానికి తన తండ్రి బాల సిద్ధారెడ్డి నాయకుడని చెప్పారు.



తాను ఈ రోజు రచయితగా ఈ స్థాయిలో ఉండడానికి తండ్రి ఇచ్చిన ప్రోత్సాహం కారణమన్నారు. నేటి నిజం పత్రిక సంపాదకుడు బైసా దేవదాసు అధ్యక్షతన జరిగిన ఈ ఆవిష్కరణ సభలో నవలను ప్రముఖ కవి వాసిరెడ్డి నవీన్ ఆవిష్కరించారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షులు విరహత్ ఆలీ, టీఎన్జీవోల సంఘం రాష్ట్ర పూర్వ చైర్మన్ దేవి ప్రసాద్ , కవులు కందుకూరు శ్రీరాములు, గోపాల్ రెడ్డి, కొమురవెల్లి అంజయ్య మాట్లాడారు. ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం పుస్తకాన్ని పరిచయం చేస్తూ గ్రామాన్ని అర్థం చేసుకుంటే మొత్తం దేశాన్నే అర్థం చేసుకున్నట్టే అన్నారు. గ్రామీణ జీవితంలోని చిన్న చిన్న పుటలు కూడా చరిత్రాత్మకమైన లోతుతో నాగటి తరం నవల్లో నిండి ఉన్నాయని అన్నారు. "తెలంగాణ భాషా సంగీతం, పల్లె జీవన విధానంలోని సాదాసీదా పసితనం, కులం, వర్గం వంటి సామాజిక ఒత్తిడుల తాలూకు చేదు వాస్తవికతను రచయిత చిత్రీకరించారని అన్నారు. ఈ నవలలోని వ్యక్తులు కేవలం పాత్రలు కావని అవి తెలంగాణ గ్రామాల్లో నడిచే మనుషులే అన్నారు. గ్రామీణుల పేదరికం, ధైర్యం, నిర్వేదం, ప్రేమ అన్నీ కలగలిసి ఒక తరాన్ని అక్షరాల్లో బంధించాయని చెప్పారు. ఈ తరహా రచనలు సాహిత్యానికి కొత్త దిశలు చూపుతాయని తెలిపారు. గ్రామీణ జీవితంలోని వాస్తవికతను, వారి కష్ట జీవితాన్ని చరిత్రగా నిలుపుతాయని నాళేశ్వరం శంకరం పేర్కొన్నారు. ఈ సభలో నర్రా భగవాన్ రెడ్డి, నర్ర మల్లారెడ్డిలతో పాటు ప్రముఖ కవులు, రచయితలు తైదల అంజయ్య, పొన్నాల బాలయ్య, సిద్ధంకి యాదగిరి, తోట అశోక్, అలాజ్ పూర్ శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ పాపయ్య, రామచంద్రరావు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోషల్ మీడియాను వ్యక్తిత్వ హననానికి ఉపయోగించడం దురదృష్టకరం. దానిపై నియంత్రణ అవసరం. హెల్తీ హ్యాపీ సొసైటీ స్థాపనే రాజ్యాంగ లక్ష్యం. రాబోయే రోజుల్లో భారత్ అన్ని రంగాల్లో నిపుణులను అందిస్తుంది. 2047 కల్లా ప్రపంచంలోనే ప్రభావవంతమైన దేశంగా భారత్ మారుతుంది.
- ఏపీ సీఎం చంద్రబాబు

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

- మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 16: ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నిరుపేదలకు సొంతింటి కలలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ చెప్పారు. ఆదివారం తిమ్మాపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో పెరుక శివాని అనే లబ్ధిదారు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలు డబుల్ బెడ్ రూమ్ నోచుకోలేదన్నారు. పేదలకు ఇళ్లు మంజూరు చేయాలన్న ధ్యా సే ఆ ప్రభుత్వానికి లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయడం, ఆ ఇళ్ల గృహప్రవేశాలు పాల్గొనడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ పూజల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాసరావు శ్రీగిరి రంగారావు, గోపు మల్లారెడ్డి, బుధారపు శ్రీనివాస్, మామిడి అనిల్ కుమార్, పోలు రాము, రమేష్‌కొత్త రాజిరెడ్డి, అబ్దుల్ రజాక్, చిరుతల యాదగిరి, గుంటి మల్లేశం, పెంట వినోద్ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ గెలుపు పై ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన సాధించిన నేపథ్యంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం తిమ్మాపూర్ మండలం అలుగునూరు గ్రామంలోని శ్రీ స్వయంభూ లక్ష్మీ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో డివిజన్ అధ్యక్షుడు రమేష్‌యాదవ్, పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, మోరపల్లి రమణారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస రావు శ్రీగిరి రంగారావు, కంది రవీందర్ రెడ్డి కంది అశోక్ రెడ్డి చిందం కిష్టయ్య సిరిసిల్ల చంద్రయ్య నేరెళ్ల జంపయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎప్పటికీ మరచిపోలేని
గొప్ప నాయకుడు మదన్మోహన్

- సిద్దిపేట కీర్తిని ఢిల్లీకి చాటిచెప్పిన మహోన్నతమైన నాయకుడు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ
- ఘనంగా మదన్మోహన్ జయంతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 16: ఎప్పటికీ మరచిపోలేని గొప్ప నాయకుడు మదన్మోహన్ అని, ఆయన ఎల్లప్పుడూ సిద్దిపేట నియోజకవర్గ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. మాజీ మంత్రి మదన్మోహన్ జయంతి సందర్భంగా ఆదివారం సిద్దిపేట పట్టణంలో అత్తు ఇమామ్, పార్టీ సీనియర్ నాయకుడు మదన్మోహన్ ప్రియ శిష్యుడు మార్క సతీశ్ గౌడ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ, అత్తు ఇమామ్, మార్క సతీష్ గౌడ్ మాట్లాడుతూ సిద్దిపేట కీర్తిని ఢిల్లీకి చాటిచెప్పిన మహోన్నతమైన నాయకుడు మదన్మోహన్ అని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని సిద్దిపేట నుంచి ఉద్యమం ప్రారంభించారని అన్నారు. మదన్మోహన్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. త్వరలోనే ముస్తాబాద్ చౌరస్తా వద్ద మదన్మోహన్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, మదన్మోహన్ చౌరస్తాగా ఏర్పాటు చేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దం లక్ష్మి, సఖి ఆనంద్, గంప మహేందర్ రావు, గంప వేణు, చాంద్ మియా, కలీముద్దీన్, గయాసుద్దీన్, అర్షద్, వహాబ్, బబ్బూ, ఇమ్రాన్ అలీ పాల్గొన్నారు.

'యూనిటీ మార్చ్' ను విజయవంతం చేయండి

- బీజేపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 16: హుజురాబాద్లో ఈనెల 19 న జరిగే కరీంనగర్ పార్లమెంట్ స్థాయి బూత్ కార్యకర్తల సమ్మేళనాన్ని, సర్దార్ వల్లాభాయ్ పటేల్ 150 జయంతి వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం రోజున తలపెట్టిన యూనిటీ మార్చ్ ప్రోగ్రామ్ లను విజయవంతం చేయాలని కరీంనగర్ జిల్లా బీజేపి అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హుజురాబాద్ బీజేపీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యదర్శి, సోషల్ మీడియా కార్యకర్తలతో సమావేశం జరుగుతుందని తెలిపారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లోకి వెళ్లేందుకు చేపట్టాల్సిన కార్యచరణపై కరీంనగర్ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశనం చేస్తారని తెలిపారు. అలాగే సర్దార్ వల్లాభాయ్ పటేల్ 150 వార్షిక జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రోజున కరీంనగర్లో తలపెట్టిన యూనిటీ మార్చ్‌ప్రోగ్రామ్ ను సక్సెస్ చేయడానికి బీజేపీ నాయకులు కార్యకర్తలు తగిన కృషి చేయాలన్నారు. సోమవారం కరీంనగర్ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల నుండి బస్టాండ్ వరకు నిర్వహించనున్న యూనిటీ మార్చ్ ప్రోగ్రాంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి నరసింహ రాజు, బీజేపీ హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, మండల అధ్యక్షులు రాముల కుమార్, జమ్మికుంట పట్టణ అధ్యక్షులు రాజు, వీణవంక మండల అధ్యక్షులు బత్తిని నరేష్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, నాయకులు యాదిరెడ్డి, యాంసాని శశిధర్, సబ్బని రమేష్, పారుపల్లి కొండాల్ రెడ్డి, మోడెపు వినయ్, భూపతి, ప్రవీణ్, నరెడ్ల ప్రవీణ్ రెడ్డి, నరెడ్ల చైతన్య రెడ్డి, చిదురాల శ్రీనివాస్, చిదురాల రాణి, ముప్పు మహేష్, తిరుపతి రెడ్డి, ప్రభాకర్, గణేష్, తూర్పాటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సేవా భావంతో సమాజానికి మేలు చేయాలి

- అదనపు ఎస్పీ మహేందర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 16: సేవా భావంతో సమాజానికి మేలు చేయాలని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. ఆదివారం పాపన్నపేట మండలం మల్లంపేట గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని అదనపు ఎస్పీ మహేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా చాలా విషయాలు తెలుసుకోవడానికి ఈ క్యాంప్ ఉపయోగపడుతుందని అన్నారు. తాను కూడా ఎన్ఎస్ఎస్ వాలంటీర్ గా 13 క్యాంప్ లలో పాల్గొన్నానని తెలిపారు. జాతీయ సమైక్యత, అడ్వెంచర్ క్యాంపులు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి వివిధ జాతీయ మరియు రాష్ట్ర స్థాయి కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. మొదటి రోజు గ్రామంలో ర్యాలీ నిర్వహించి, గ్రామ విషయాలను సామాజిక అంశాలు అవగాహన తెలుసుకున్నాం అని వివరించారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ నర్సింహులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ జూలకంటి శ్రీనివాస్, కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ ఎస్.సంతోష్ కుమార్, జువాలజీ లెక్చరర్ ప్రవీణ్, అధ్యాపక అధ్యాపకేతర బృందం, గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడా స్ఫూర్తిని చాటిన
పోలీస్, జర్నలిస్టుల క్రికెట్ మ్యాచ్

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

ప్రతిపక్షం, మెదక్ ప్రతినిధి, నవంబర్ 16: పోలీస్-జర్నలిస్టుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ క్రీడా స్ఫూర్తిని చాటుకుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. ఆదివారం పోలీసులు జర్నలిస్టులు కలిసి స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం జరిగింది. మొదట టాస్ గెలిచిన జర్నలిస్టుల జట్టు కెప్టెన్ నరేష్‌బ్యాటింగ్ ఎంచుకున్నారు. జర్నలిస్టుల జట్టు 15.5 ఓవర్లలో 101 పరుగులు చేసింది. 102 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా పోలీస్ జట్టు 2 వికెట్లు మాత్రమే కోల్పోయి, 11.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించగలిగింది. చివరి పరుగును స్వయంగా జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు చేసి జట్టుకు విజయాన్ని అందించారు. మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన నరేష్ ఆర్ఎస్ఐ "మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్" బహుమతిని, రన్నరప్‌గా నిలిచిన జర్నలిస్టుల జట్టుకు, విన్నర్‌గా నిలిచిన పోలీస్ జట్టుకు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు బహుమతులను అందజేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శారీరక ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు, జట్టు భావన అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. అదే విధంగా భవిష్యత్తులో మెదక్ పోలీస్ కార్యాలయం ప్రాంగణంలో అత్యాధునిక ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న క్రికెట్ గ్రౌండ్ ను అతిత్వరలో ఒక అంతర్జాతీయ క్రికెట్ ప్లేయర్ తో ప్రారంభింప చేస్తామన్నారు.



మహాసభలను
విజయవంతం చేయండి

ప్రతిపక్షం ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల, నవండర్ 16: నేడు రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నంలో తలపెట్టిన రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం యూనియన్ సీఐటీయూ నాలుగో మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలో సీఐటీయూ అనుబంధం మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్ను విడుదల చేయడం జరిగింది. ఈ రాష్ట్ర మహాసభలకు ఈ జిల్లాలోని అన్ని గ్రామాలలో పని చేస్తున్నటువంటి మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున రంగారెడ్డి జిల్లాఇబ్రహీంపట్నంలో జరుగుతున్న మహాసభలను ఇక్కడి నుంచి తరలి వెళ్లి విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా సీఐటీయూ పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా కార్యదర్శి గురిజాల శ్రీధర్, మరియు మధ్యాహ్న భోజన కార్మికులు గొట్టే బాలమణి, మ్యకాలా కవిత, వసంత, లక్ష్మి, రేణుకా, తదితరులు పాల్గొన్నారు.



మేల్, ఫీమేల్ వరి వంగడాల పేరిట మోసం

- కంపెనీలపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలి
- ఎకరాకు రూ. 80 వేలు నష్ట పరిహారం అందించాలి

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్(చేగుంట), నవంబర్ 16: : మెదక్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న కంపెనీలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని మానవ హక్కుల వేదిక డిమాండ్ చేసింది. ఆదివారం మన హక్కుల వేదిక నేతలు షేక్ అహ్మద్, దిలీప్, రోహిత్, సిరి బృందం చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలోని రైతులను కలిసింది. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించి రైతుల సమస్యలు నమోదు చేసుకుంది. విత్తన కంపెనీలు ఒక మాఫియాగా మారి రైతులను బాహాటంగా మోసం చేస్తున్న తీరు గర్హనీయమని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి షేక్ అహ్మద్ పేర్కొన్నారు. మేల్, ఫీమేల్ వంగడాలంటూ ఉచితంగా విత్తనాలు సరఫరా చేసి రైతులను కొన్ని కంపెనీలు మోసం చేస్తున్నాయన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ తంతు జరుగుతుందని, దీనిపై సమగ్రమైన విచారణ జరిపి మోసాలున్న అరికట్టాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు నిత్యం పర్యటిస్తున్న చోట ఇలాంటి ఘటనలు నమోదవుతుండడం ఆశ్చర్యకరమన్నారు. విత్తన కంపెనీలపై కేసులు నమోదు చేసి రైతులకు ఎకరాకు 80 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రుక్మాపూర్ గ్రామంలో 100 ఎకరాల పంట నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంటల కోసం చేసిన అప్పులు తాళలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన నమోదు కావడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై వ్యవసాయ శాఖ అధికారులు విచారణ జరిపినప్పటికి ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరమన్నారు. పోలీసులు సదరు కంపెనీల ప్రతినిధులపై కేసులు నమోదు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పర్యవేక్షణాధికారులు పోస్టులు భర్తీ చేయాలి

- ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టు కేటాయించాలి
- తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి
- సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి
- తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయల తిరుపతి



ప్రతిపక్షం, నంగునూరు, నవంబర్ 16: పర్యవేక్షణాధికారుల పోస్టులను భర్తీ చేసి వారితోనే పాఠశాలల్లో నిరంతర పర్యవేక్షణ చేయించి విద్యా ప్రమాణాల పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీరకాయల తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు. సహచర ఉపాధ్యాయులతో పర్యవేక్షణ చేయించడం వల్ల వారు పని చేసే పాఠశాలల్లో విద్య బోధన కుంటుపడే ప్రమాదం ఉందని చెప్పారు. సర్వీసులోని ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నంగునూరు మండల కార్యవర్గ సమావేశం సిద్దిపేటలోని సరస్వతీ శిశు మందిర్ లో శనివారం రాత్రి జరిగింది. తపస్ నంగునూరు మండల అధ్యక్షుడు పయ్యావుల జైపాల్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీర కాయల తిరుపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించి పేద,బడుగు, బలహీన వర్గాల పిల్లలు చదివే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయ పోస్టు మంజూరు చేసి,పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో ప్రతి తరగతి ఒక ఉపాధ్యాయ పోస్టును కేటాయించడంతో పాటు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు పోస్టులను మంజూరు చేయాలని చెప్పారు. ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు నిబంధనలు(ఉమ్మడి సేవా నిబంధనలు) రూపొందించి పదోన్నతులు కల్పించాలని కోరారు. తద్వారా పర్యవేక్షణాధికారుల పోస్టులను భర్తీ చేసి విద్యారంగాన్ని పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు గడీల శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పట్ల ప్రభుత్వం నాన్చుడు వైఖరి అవలంబిస్తోందని వాపోయారు. తక్షణమే విద్యావ్యవస్థను పటిష్టం చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తపస్ సిద్దిపేట డివిజన్ ఇంఛార్జి అనుముల వీరేశం మాట్లాడుతూ జాతీయ వాద ఉపాధ్యాయ సంఘం అయిన తపస్ ను ఉపాధ్యాయులందరూ ఆదరించి, తపస్ లో సభ్యత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తపస్ నంగునూరు మండల అధ్యక్షుడు పయ్యావుల జైపాల్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తపస్ నంగునూరు మండల ప్రధాన కార్యదర్శి ముంద్రాతి రాములు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. పాఠశాలలకు కనీస మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ సిద్దిపేట జిల్లా నాయకులు కత్తుల రాంరెడ్డి, దుద్దేడ పరశు రాములు, దీకొండ గోవర్ధన్, సతీశ్, మండల కార్యవర్గ సభ్యులు బొజ్జ చంద్రకాంత్, శ్రీనివాస్ రెడ్డి, పులగూర్ల రాజేశ్వర్ రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

త్వరలో జాగృతి బలోపేతం

- అన్నిస్థాయిలో కమిటీలు వేసేందుకు సిద్ధం



ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, నవంబర్ 16: కరీంనగర్ జిల్లా జాగృతి ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్ రూప్ సింగ్ హాజరైనారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వారు జిల్లాలో జాగృతి బలోపేతానికి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రూప్ సింగ్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో జాగృతిని బలోపేతం చేయాలనే నిర్ణయంతో రానున్న రోజుల్లో జాగృతి అనుబంధ విభాగాల కమిటీలు అన్ని మండల కమిటీలు, జిల్లా స్థాయిలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. కవిత చేపట్టిన జాగృతి జనం బాట కార్యక్రమానికి ప్రజల నుండి విశేషమైన స్పందన వస్తుందని అన్నారు. జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జాగృతి ప్రజలను కలుపుకొని ప్రభుత్వం పైన పోరాడాల్సిన చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అనంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, మాజీ ఉప సర్పంచ్ బుడిగ పర్శరం గౌడ్, గాలిపల్లి రత్నాకర్, పెండ్యాల మహేష్, అపర్ణ, సంగీత రెడ్డి, రంగరవేణి లక్ష్మణ్, యం ఎ రాజీ, సంగీత, సరూప, లక్ష్మణ్, యాకుబ్, తిరుపతి, పిట్టల సత్యం, సురేందర్ రెడ్డి, కొత్తురి రఘు, హుస్సేన్, రోజా రెడ్డి, తదితరులు ఉన్నారు



ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం ఇచ్చింది. సాంఘిక, ఆర్థిక న్యాయ సాధన కోసం రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపరిచారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగిస్తూ అంబేడ్కర్ చేసిన ప్రసంగం ప్రతి న్యాయవాదికి కంఠోపాఠం కావాలి. అంశం ప్రాధాన్యతను బట్టి రాజ్యాంగ సవరణ విధానాలను అంబేడ్కర్ ఏర్పాటు చేశారు.

-సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్



లాలూ ప్రసాద్ పై మండిపడిన కూతురు రోహిణి

- తనను ఘోరంగా అవమానించారని ఆరోపణ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 16 : బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణీ ఆచార్య సంచలన విమర్శలు చేశారు. తనను తన కుటుంబ సభ్యులే అవమానించారని, బెదిరించారని, చెప్పుతో దాడి చేయడానికి యత్నించారని ఆరోపించారు. తాను ఆత్మగౌరవం విషయంలో రాజీ పడలేదని, సత్యాన్ని వదులుకోవడానికి నిరాకరించానని కూడా అన్నారు. ఒక కుమార్తెను, ఒక సోదరిని, ఒక వివాహితను, ఒక తల్లిని అవమానించారని, అసభ్యకరంగా దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడుస్తున్న తల్లిదండ్రులు, సోదరీమణులను వదిలి ఒక కుమార్తె వెళ్లిపోయిందని, వారు తనను తల్లి ఇంటి నుంచి దూరం చేశారని అన్నారు. అనాథగా వదిలేశారని మండిపడ్డారు. అటు ఏ కుటుంబానికి రోహిణి లాంటి కూతురుసోదరి ఉండకూడదని అన్నారు. తన తండ్రి లాలూకు కిడ్నీ దానం చేయడంపైనా రోహిణీ పలు వ్యాఖ్యలు చేశారు. తాను అసహ్యంగా ఉన్నానంటూనే దుర్భాషలాడారని, తిరిగి తన మురికి కిడ్నీనే తండ్రికి దానం చేయించారని ఎద్దేవా చేశారు. కిడ్నీని దానం చేసేటప్పుడు తన కుటుంబం గురించి ఆలోచించకుండా పెద్ద తప్పు చేశానన్నారు. ఇందుకు తన భర్త, అత్తమామల అనుమతి కూడా తీసుకోలేదన్నారు తనలాగా ఎప్పుడూ తప్పు చేయవద్దన్నారు.

విశ్వ వీక్షణం



ఎర్రకోట పేలుడు కేసులో మరో డాక్టర్ అరెస్టు

- పోలీసుల అదుపులో వైద్యురాలు ప్రియాంక శర్మ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 16 : ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుడు ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది. ఈ కేసులో హర్యానాకు చెందిన వైద్యురాలు ప్రియాంక శర్మను పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె జమ్మూ కశ్మీర్‌లోని ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఇటీవల అరెస్టు అయిన ముగ్గురు వైద్యులలో ఒకరైన అదీల్అహ్మద్‌తో ఆమెకు పరిచయం ఉందని పోలీసులు చెబుతున్నారు. అనంత్‌నాగ్‌లో ప్రియాంక ఉంటున్న హాస్టల్ నుంచి ఆమెను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఆమె మొబైల్ ఫోన్, సిమ్ కార్డును ఫోరెన్సిక్ బృందాలు పరిశీలిస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా, దాదాపు 200 మంది కశ్మీర్ వైద్యులపైనా, ప్రముఖ నగరాల కళాశాలలు, విశ్వ విద్యాలయాలలో చదువుకున్న కశ్మీరీ విద్యార్థులపైనా నిఘా పెట్టామని వారు వివరించారు. ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డా. ఉమర్ హర్యానాలోని నూహ్‌లో కొన్ని రోజులు ఉన్నాడని గుర్తించారు. పేలుడుకు పది రోజుల ముందే అక్కడి హిదాయత్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడని, ఈ ఘటనకు ముందు వరకు అక్కడే ఉన్నాడని తెలిపారు. ఈ నెల పదిన అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తన ఐ20 కారులో పేలుడు పదార్థాలను తీసుకొని బయల్దేరాడని చెప్పారు. ఫిరోజ్‌పూర్ ఏటీఎం నుంచి డబ్బులు తీసుకోవడానికి యత్నించినా సాధ్యం కాకపోవడంతో నూహ్‌కు వచ్చాడని సమాచారం. స్థానికంగా ఉన్న ఓ అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్‌కు అమర్చిన సీసీ కెమెరాల ద్వారా ఉమర్ కారు ఆ కాలనీలోకి ప్రవేశించినట్టు పోలీసులు గుర్తించారు.

మహిళలకు ఇచ్చినవి ప్రపంచ బ్యాంకు నిధులు

- రూ.14 వేల కోట్లు దారి మళ్లించారన్న 'జన్ సురాజ్'

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 16 : బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో గెలవడానికి రూ.14 వేల కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులను కేంద్ర సర్కారు దుర్వినియోగం చేసిందని జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్, అధికార ప్రతినిధి పవన్ వర్మ ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడానికి సరిగ్గా గంట ముందు నిధులను 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'కు మళ్లించారని విమర్శించారు. అందుకే,1.25 కోట్ల మంది మహిళల బ్యాంకు ఖాతాలలో రూ.10 వేల చొప్పున జమయ్యాయని తెలిపారు. మరో ప్రాజెక్టు కోసం భారత్‌కు ప్రపంచ బ్యాంకు మంజూరుచేసిన నిధులను తీసుకున్నారన్నారు.



జూన్ నుంచి బిహార్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే వరకు నితీశ్ ప్రభుత్వం ఓట్లను కొనడానికి రూ.40 వేల కోట్లు ఖర్చు చేసిందని కూడా వారు ఆరోపించారు. దీంతో ఎన్డీయే నేతలు ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసినట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. దీనిపై ఎన్నికల సంఘం సమగ్రంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బిహార్‌లో నాలుగు కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, వ్యూహాత్మకంగానే 1.25 కోట్ల మంది ఖాతాలలో రూ.14 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం జమ చేసిందని పేర్కొన్నారు. అనంతరం మళ్లీ ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడకుంటే మిగతా 2.75 కోట్ల మంది మహిళలకు రూ.10 వేలు అందవని ప్రచారం చేశారన్నారు. దీంతో ఆ 2.75 కోట్ల మంది మహిళలు వారికి ఓట్లు వేశారని చెప్పారు.

ఛత్తీస్ గఢ్ అడవులలో మరో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మహిళలు సహా ముగ్గురు మావోయిస్టుల మృతి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, సుక్మా (ఛత్తీస్‌గఢ్), నవంబర్ 16 : మావోయిస్టుల ఏరివేతను భద్రతాదళాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నాయి. సుక్మా జిల్లాలో ఆదివారం నాడు జరిగిన ఎదురుకాల్పులలో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. ఘటనా స్థలం నుంచి 303 రైఫిల్, బీజీఎల్ లాంచర్లు, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినవారిని మిలిషియా కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడైన మద్వి దేవా, సీఎన్ఎం కమాండర్ పోడియం గంగి, కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు సోడి గంగిగా గుర్తించారు. వీరందరిపైనా తలా రూ.5 లక్షల రివార్డు ఉందని అధికారులు తెలిపారు. భేజ్జీ, చింతగుఫా సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో జిల్లా రిజర్వ్‌గార్డ్ దళాలు వేటను మొదలుపెట్టాయి.



ఈ క్రమంలో అడవిలో ఆదివారం ఉదయం ఇరువైపులా కాల్పులు జరిగాయి. మృతులలో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. మద్వి దేవా మిలిషియా కమాండర్, స్నిపర్, కొంటా ఏరియా కమిటీ సభ్యుడు. సీఎన్ఎం కమాండర్ అయిన పోడియం గంగి కొంటా ఏరియా కమిటీ సభ్యురాలు. సోడి గంగి కిష్టారామ్ ఏరియా కమిటీ సభ్యురాలు. బస్తర్ ఐజీ సుందర్ రాజ్ పట్టిలింగం మాట్లాడుతూ బస్తర్ ప్రాంతంలో మావోయిజం చివరి దశలో ఉందన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసిపోవడం తప్ప వేరే మార్గం లేదని తెలిపారు. నిర్ణీత సమయంలోపు బస్తర్‌లో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని అన్నారు.

ఇస్రో ముందు ఈ యేడాది భారీ ప్రణాళికలు

- మీడియాకు వెల్లడించిన చైర్మన్ వి. నారాయణన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 16 : తమ ముందు చంద్రయాన్4, గగన్‌యాన్, సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, ఉపగ్రహాల ప్రయోగాలు సహా భారీ ప్రణాళిక ఉందని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ తెలిపారు. ప్రస్తుతం ఇస్రో అనేక ప్రణాళికలతో బిజీగా ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు ఏడు ప్రయోగాలు చేసేందుకు తాము సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. లక్ష్యం వీటిలో పీఎస్ఎల్వీ, గగన్‌యాన్‌తో పాటు ఓ వాణిజ్య కమ్యునికేషన్ ఉపగ్రహ ప్రయోగం కూడా ఉందని చెప్పారు. పూర్తిగా దేశీయంగా తయారు చేసిన పీఎస్ఎల్వీ ప్రయోగం కూడా ఇందులో ఉంటుందన్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వం చంద్రయాన్-4 మిషన్‌కు ఆమోదం తెలిపిందని తెలిపారు. 2028 నాటికి చంద్రుడి నుంచి మట్టి నమూనాలను సేకరించి



భూమిపైకి తీసుకురావడానికి ఇది పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం రష్యా, అమెరికా, చైనా దేశాలకు మాత్రమే చంద్రుని నుంచి నమూనాలు సేకరించే సాంకేతికత ఉందన్నారు. అందుకే ఇస్రో సొంతంగా చంద్రుని నుంచి మట్టి నమూనాలు సేకరించే టెక్నాలజీని సాధించాలని చూస్తోందన్నారు. 2023 నాటికి భారత్ సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు చేసుకోవాలని లక్ష్యంగా కూడా పెట్టుకున్నామన్నారు.




ఎడారి వసంతం-27

గొలుసు కథ



కె.ఇ. నిలమంగై
హైదరాబాద్



జరిగిన కథ:

అంజలి తన కూతురు పరిణయను తీసుకొని ఇండియా వస్తుంది. తన తప్పలను మన్నించి, క్షమించుమని భర్త సూర్యను అభ్యర్థిస్తుంది. అనేక గొడవల మధ్య హరి, సుందరిల హల్దీ ఫంక్షన్ మొదలవుతుంది. సంకేత్ కిడ్నాప్ చేసిన విద్యార్థిని విడిచిపెట్టమంటుంది ఇందిర. కానీ తాను ఎవరినీ కిడ్నాప్ చేయలేదని నిజం చెప్తాడు సంకేత్. జ్వాలాముఖి సూర్యకి ఫోన్ చేసి సిరిమువ్వ తిరిగి ఆపదలో ఉందని, ఆమెని జాగ్రత్తగా చూసుకోవాలని చెబుతుంది.
(ఇక చదవండి)

జ్వాలాముఖి ముగ్గురు వ్యక్తుల ముసుగు తొలగించి చూసి, అందులో ప్రధానమైన వ్యక్తి ముఖం చూసి ఆశ్చర్యానికి లోనైంది. అతడు చక్రవర్తి తమ్ముడు కృష్ణ. విశాల భావాలున్న చక్రికి ఇలాంటి క్రూరుడు తమ్ముడా అని బాధపడింది. మిగిలిన ఇద్దరూ ఝాన్సీని మోసం చేసిన శ్యాం, దీక్షని లైంగిక వేధింపులకు గురిచేసిన స్మార్ట్ లు. వెంటనే స్టేషన్లో వున్న కానిస్టేబుల్స్ కి థర్డ్ డిగ్రీతో వాళ్ళని శిక్షించమని చెప్పి కుర్చీలో చేరగిలపడింది ఆలోచనల దొంతరలు కమ్ముకొంటుంటే....

****

హాస్పిటల్లో బలరాంని కిటికీ దగ్గరికి వచ్చి భయపెట్టిన వ్యక్తి ఎవరో కనిపెట్టాలని జ్వాల ఈ ఆపరేషన్ ప్రారంభించింది. తనకు దొరికిన ముగ్గురు కాకుండా వేరెవరో ఈ ప్రణాళికను వేస్తున్నారని ఇందులో పావులుగా ఈ ముగ్గురినీ, డిపార్టుమెంటుకు సంబంధించిన బలరాంని వాడుకుంటున్నారనే ఆలోచన వచ్చింది.
బలరాం చెప్పాలనుకునే విషయం ఏమిటో తేలిస్తే కానీ ఈ కేసు ముందుకు సాగదని ఆమెకు అర్థమైంది. హాస్పిటల్ చుట్టూ బందోబస్తు పెంచి, బలరాంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే ప్రయత్నం చేస్తోంది..

****

ఎన్నో అవాంతరాల మధ్య హల్దీ ఫంక్షన్ జరుపుకున్న హరీ, సుందరి జంటను కాపాడుతూ చక్రవర్తి, ఇందిర, అంజలి, సూర్య, ఝాన్సీలు అప్రమత్తంగా వున్నారు. ఎదురు సన్నాహాల వేడుకలకు సిద్ధమవమని చెప్పారే కానీ వారి మనసుల్లో ముందు ముందు ఏంజరుగుతుందో తెలియని ఉత్సుకత రేసుగుర్రం కన్నా వేగంగా పరుగులు తీస్తోంది.
సిరిమువ్వను ఎంతో అపురూపంగా చూసుకుంటూ సుగుణమ్మ ప్రణవ్ కి ధైర్యం చెపుతోంది గానీ తన స్నేహితురాలు నాగరత్నం కుటుంబం తమ కుటుంబానికి చేస్తున్న కుట్రలకి లోలోపల భయపడుతూనేవుంది. దీనికి ఎలా ముగింపు దొరుకుతుందా అనే ఆలోచనలో పడుతూ..

****

ఝాన్సీకి శ్యాం పంపిన హార్డ్ డిస్కులో ఉన్న సమాచారాన్ని ఖాళీగా వున్నప్పుడు చూద్దామని పక్కన పడేసింది జ్వాల. అది ఇప్పుడు గుర్తుకు వచ్చి దీనిలో ఏదన్నా క్లూ దొరకవచ్చేమో అని యధాలాపంగా సిస్టం ఆన్ చేసింది. అందులో సిరికి సంబంధించిన ముఖ్యమైన విషయం దొరికింది. దీనికంతటికీ మూలం అమెరికాలోనే మొదలైందని తెలుసుకొని ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యింది జ్వాల. నాగరత్నం పెంచి పోషించిన ఒక విషవృక్షం అతులిత్. అతను పరిణయ స్నేహితుని రూపంలో నాటకం ఆడుతున్నాడు. తెరవెనుక నుంచీ సిరి పేరున ఉన్న ఆస్తిపై కన్నేసి ప్రాణహానికి కూడా వెనుకంజ వేయటం లేదు. ఈ విషయం సీక్రేట్ కోడ్లో పోస్ట్ అయిందనే విషయం తెలుసుకొంది. కానీ ఈ కోడ్ను డీకోడ్ చేసేదెవరా అని ఆలోచించింది. ఉన్నట్లుండి మెదడులో తళుక్కుమని మెరిసిందో మెరుపు. అతను గుర్తుకు వచ్చాడు ఆమెకు. ఇంటెలిజెంట్ డిపార్టుమెంటులో ఉన్నత పదవిలో పనిచేస్తూ లా అండ్ ఆర్డర్ ను కాపాడే ఉన్నతమైన వ్యక్తి. తమందరికీ ఆప్తుడై హరి,సుందరిల పెళ్ళికి వచ్చిన ముఖ్యమైన వ్యక్తి సంపత్ అతను.

(సశేషం)

పండ్ల గుజ్జుతో నిగారింపు..





శారీరక సౌందర్యం కోసం ఖరీదైన లోషన్లు, క్రీములను మితిమీరి వాడడం వల్ల రసాయనాల దుష్ప్రభావం బారిన పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సొంత వైద్యంతో ఇబ్బందులను ఎదుర్కొనే బదులు ఇంట్లోనే కొద్దిపాటి చిట్కాలు పాటిస్తే చర్మ సంరక్షణ సులభంగానే సాధ్యపడుతుంది. ఆయా సీజన్లలో లభించే తాజాపండ్లను తినడానికే కాదు, శారీరక సౌందర్యం పెంచుకునేందుకు కూడా వాడవచ్చు. విలువైన పోషకాలున్నందున పండ్ల గుజ్జును ముఖానికి, శరీరంలోని ఇతర భాగాలకూ రాసుకుంటే చర్మం మిలమిలా మెరుస్తుంది. అరటి, ఆరెంజ్, స్ట్రాబెర్రీ వంటి పండ్లే కాదు, కొబ్బరి, కీరదోస వంటివి కూడా చర్మ సంరక్షణకు ఉపయోగపడతాయి.

అరటిపండ్లతో..

పొడిచర్మం గలవారు అరటి పండ్ల గుజ్జును రాసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. చల్లార్చిన పాలలో అరటి పండ్ల ముక్కలు వేసి గుజ్జుగా చేసుకుని, కాస్త నిమ్మరసం కలిపి చర్మానికి రాసుకుని.. అరగంట తర్వాత చన్నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వారానికి నాలుగైదు సార్లు ఇలా చేసుకుంటే చర్మం తేమను సంతరించుకుంటుంది. శరీరంపై మచ్చలు, ముడతలు అంతరించిపోతాయి.

ఆరెంజ్ రసంతో..

మంచి రుచిని అందించే ఆరెంజ్ పండ్లు దేహ సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తాయి. తాజా పాలమీగడలో రెండు చెంచాల ఆరెంజ్ రసం కలిపి పేస్టులా చేసుకుని శరీరానికి రాసుకోవాలి. ఈ మిశ్రమాన్ని 'ఫేస్ ప్యాక్'లా కూడా వేసుకోవచ్చు. చర్మంపై మృతకణాలను తొలగించే గుణం ఆరెంజ్ రసంలో ఉంది. పాలమీగడ కారణంగా చర్మం మృదుత్వాన్ని సంతరించుకుంటుంది.

ఆపిల్స్‌తో..

చర్మం పొడిబారుతున్నట్లు అనిపిస్తే ఆపిల్ పండ్లను ముక్కలుగా చేసి పాలలో వేసి పేస్టులా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకుని పావుగంట తర్వాత పరిశుభ్రమైన నీటితో కడిగేసుకోవాలి. ఇలా కొన్నిరోజుల పాటు క్రమం తప్పకుండా చేస్తే, నల్లటి మచ్చలు తొలగిపోయి చర్మం మంచి నిగారింపును సంతరించుకుంటుంది. చర్మం పొడిబారడం, పగుళ్లు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే తాజా స్ట్రాబెర్రీ పండ్లను గుజ్జులా చేసి కాస్త మలాయ్ కలిపి ముఖంపై పొరలుగా రాసుకుని అరగంట తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీరానికి మంచి రంగు, నిగారింపు వస్తాయి.

కొబ్బరి నీళ్లతో..

కొబ్బరి నీళ్లలో కాస్త తేనె కలిపి ముఖానికి రాసుకుని పావుగంట తర్వాత కడిగేసుకోవాలి. రోజు విడిచి రోజు ఇలా చేస్తే ముఖచర్మం కాంతులీనుతుంది. కొబ్బరి నీళ్లలోని యాంటీ ఆక్సిడెంట్లతో చర్మానికి మెరుపుదనం వస్తుంది. పండ్ల గుజ్జుతో ఫేస్‌ప్యాక్ వేసుకునే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కళ్లకు హాని కలగకుండా వీటిని వినియోగించాలి. పండ్ల గుజ్జులో నిమ్మరసం కలిపితే కంటికి తగలకుండా చూసుకోవాలి. చెవులు, కళ్ల వద్ద సున్నితమైన చర్మానికి తగలకుండా ఫేస్‌ప్యాక్‌లు వేసుకోవడం ఉత్తమం.



సౌతాఫ్రికా చేతిలో టీమిండియా ఓటమి

- 30 పరుగుల తేడాతో గెలిచిన సఫారీలు

సౌతాఫ్రికాతో కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ లో జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఓడిపోయింది. సౌతాఫ్రికా 30 పరుగుల తేడాతో గెలిచింది. బౌలర్లకు అనుకూలించిన పిచ్ మీద స్వల్ప స్కోర్లే నమోదయ్యాయి. ఈ లో స్కోరింగ్ మ్యాచులో 124 పరుగులు కూడా చేయలేక భారత్ చేతులెత్తేసింది. 93 పరుగులకే ఆలౌటైంది. వాషింగ్టర్ సుందర్ 31. అక్షర్ పటేల్ 26 పరుగులు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో మెడ నొప్పి కారణంగా తప్పుకున్న శుభ్‌మన్ గిల్ రెండో ఇన్నింగ్స్‌లోనూ బ్యాటింగ్‌కు రాలేదు. సౌతాఫ్రికా బౌలర్లలో హార్మర్ నాలుగు, యాన్సెన్ రెండు, కేశవ్ మహారాజ్ రెండు, ఐడెన్ మార్‌క్రమ్ ఒక వికెట్ పడగొట్టారు. రెండు ఇన్నింగ్స్‌లోనూ సౌతాఫ్రికా 153 పరుగులకే ఆలౌటైంది. దీంతో భారత్ ఎదుట 124 పరుగుల టార్గెట్ నమోదైంది. అభిమానులు పరవాలేదనే అనుకున్నారు. కానీ, అనుకున్నదాని కంటే బంతి ఎక్కువగా టర్న్ అవ్వడంతో వికెట్లు వెంట వెంటనే కూలిపోయాయి. జైస్వాల్ (0) పరుగులేమీ చేయకుండానే ఔటయ్యాడు. నాలుగు బంతులే ఎదుర్కొని యాన్సెన్‌కు చిక్కాడు. ఆ తర్వాత రాహుల్ (1), ధ్రువ్ జురెల్ (13), రిషభ్ పంత్ (2) ఔటయ్యారు. సుందర్ 92 బంతులు ఎదుర్కొని 31 పరుగులు చేశాడు. జడేజా (18) కూడా ఉండడంతో భారత్ గెలుస్తుందనే అందరూ అనుకున్నారు. ఈ లోపు ఇటు జడేజాను హార్మర్ ఔట్ చేశాడు. దీంతో 64 పరుగులకే భారత్ ఐదు వికెట్లు కోల్పోయింది. కాసేపటికే సుందర్ కూడా ఔటయ్యాడు. ఈ దశలో అక్షర్ పటేల్ వేగంగా ఆడేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. రెండు సిక్స్‌లు, ఒక ఫోర్ బాది ఆశలు రేపాడు. కానీ మహారాజ్ అక్షర్‌ను వెనక్కి పంపాడు. అప్పటికే భారత్ ఎనిమిది వికెట్లు కోల్పోయింది. చివరికి సిరాజ్ కూడా ఔట్ కావడడంతో భారత్ ఇన్నింగ్స్ ముగిసింది.



యువ భారత్ కు పరాభవం... పాక్ చేతిలో ఓటమి

ఆసియా రైజింగ్ స్టార్స్‌లో యువ భారత జట్టుకు చుక్కెదురైంది. లీగ్ దశలో భారత్.. పాకిస్థాన్ చేతిలో పరాభవం పాలై ఈ టోర్నీలో తొలి ఓటమిని ఎదుర్కుంది. మాజ్ సదాకత్ (79*) బ్యాట్‌తో పాటు బంతి (2/12) రాణించడంతో మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం సాధించిన పాక్ ఏకపక్ష విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన యువ భారత్.. 19 ఓవర్లలో 136 రన్స్‌కే ఆలౌట్ అయింది. వైభవ్ సూర్యవంశీ (45), నమన్ ధీర్ (35) ధాటిగా ఆడినా మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఛేదనను పాక్.. 13.2 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది.

వైభవ్ మెరిసినా.. స్వల్ప స్కోర్ కే పరిమితం

సియా కప్ రైజింగ్ స్టార్స్ రెండో మ్యాచ్‌లో భారత ఏ బ్యాటర్లు విఫలమయ్యారు. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(45) మినహా ఏ ఒక్కరూ క్రీజులో నిలవలేదు. పాకిస్థాన్ ఏ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న వైభవ్ శుభారంభమిచ్చినా మిడిలార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. నమన్ ధిర్(35).. డెత్ ఓవర్లలో హర్ష్ దూబే(19) బ్యాట్ ఝులిపించడంతో భారత జట్టు స్కోర్ 130 దాటింది. పాక్ స్పిన్నర్లు విజృంభించడంతో టీమిండియా 19వ ఓవర్లలోనే 137కు ఆలౌటయ్యింది. ఆసియా కప్ తొలి పోరులో దంచేసిన భారత బ్యాటర్లు పాకిస్థాన్ ఏపై మాత్రం తడబడ్డారు. టాస్ ఓడిన టీమిండియాకు ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ(45), ప్రియాన్ష్ ఆర్య(10)లు శుభారంభమిచ్చారు. తొలి బంతినే బౌండరీకి పంపిన ఈ చిచ్చరపిడుగు.. రెండో ఓవర్ చివరి రెండు బంతులను ఫోర్, సిక్స్‌గా మలిచాడు. మూడో ఓవర్లో బౌండరీ బాదిన ప్రియాన్ష్.. నాలుగో ఓవర్ తొలి బంతికి ఫోర్ కొట్టాడు. కానీ, అదే ఊపులో షాట్ ఆడబోయిన అతడు.. టైమింగ్ మిస్ అయ్యి మిడాఫ్‌లో సులువైన క్యాచ్ ఇచ్చాడు.






డెఫ్‌లింపిక్స్‌లో సత్తా చాటిన తెలంగాణ షూటర్

ఇటీవల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్న తెలంగాణ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. టోక్యోలో జరుగుతున్న 25వ సమ్మర్ డెఫ్‌లింపిక్స్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగం ఫైనల్‌లో 23 ఏండ్ల ధనుష్.. 252.2 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంతో పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. తాజా ప్రదర్శనతో గతంలో అతడే నెలకొల్పిన ప్రపంచ రికార్డు (251.7) కూడా కనుమరుగైంది. భారత్‌కే చెందిన మహ్మద్ వానియా (250.1) రజతం సాధించడంతో దేశానికి డబుల్ ఆనందం దక్కినట్లైంది. దక్షిణ కొరియాకు చెందిన బేక్ సెంఘుక్ (223.6) కాంస్యం సాధించాడు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో తెలంగాణ షూటర్.. 630.6 పాయింట్లు స్కోరు చేసి ప్రపంచ రికార్డు సృష్టించాడు. ధనుశ్, వానియతో పాటు మహిళా షూటర్లు రెండు పతకాలతో మెరిశారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్‌లో మహిత్ (250.5) రజతం గెలువగా ఇదే పోటీలో కోమల్ మిలింద్ (252.4) కాంస్యం నెగ్గింది.

భారీ నజరానా ప్రకటించిన ప్రభుత్వం

స్వర్ణంతో మెరిసిన ధనుష్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ. 1.20 కోట్ల నజరానా ప్రకటించింది. స్పోర్ట్స్ పాలసీ ప్రకారం ధనుష్‌కు ఈ నగదు బహుమానాన్ని అందజేయనున్నట్టు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.



బాక్సర్ల జోరు

ప్రపంచ బాక్సింగ్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు తొలిరోజే అదరగొట్టారు. ఏడాది విరామం తర్వాత బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టిన ప్రీతి పవార్.. మహిళల 54 కిలోల విభాగంలో సెమీఫైనల్స్ చేరి పతకాన్ని ఖాయం చేసుకుంది. ఉమెన్స్ క్వార్టర్స్‌లో ప్రీతి.. నిగిన ఉక్తామొవ (ఉజ్బెకిస్థాన్)ను ఓడించి సెమీస్ చేరింది. ఆమెతో పాటు 48 కిలోల విభాగంలో ప్రపంచ చాంపియన్ మీనాక్షి హుడా, పురుషుల క్యాటగిరీలో నరేందర్ (+90 కిలోలు), అంకుష్ పంగల్ (80 కి.) సైతం సెమీస్ చేరారు.



3డీ ఫార్మాట్‌లో అఖండ 2

నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'అఖండ 2'. ఈ మూవీ గురించి చిత్ర బృందం సినీ అభిమానులకు ఒక ఆసక్తికరమైన అప్‌డేట్‌ను అందించింది. తాజాగా నిర్వహించిన 'అఖండ 2' బిగ్ రివీల్ ప్రెస్‌మీట్‌లో చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ... ఈ సీక్వెల్‌ను సాధారణ 2డీ వెర్షన్‌తో పాటు 3డీ ఫార్మాట్‌లో కూడా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే గొప్ప అనుభూతిని పంచే సినిమాల్లో 'అఖండ 2' ఒకటిగా నిలవనుంది. 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమాను చూడటం ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని ఇస్తుంది అని టీమ్ ధీమా వ్యక్తం చేసింది. బోయపాటి మార్క్ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు 3డీలో మరింత అద్భుతంగా ఉంటాయని అభిమానులు ఆశిస్తున్నారు. బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న ఈ చిత్రం, గతంలో సంచలనం సృష్టించిన 'అఖండ'కు సీక్వెల్‌గా వస్తోంది. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

అబ్బురపరిచిన 'వారణాసి'

సూపర్ స్టార్ మహేశ్‌బాబు - దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ 'వారణాసి' నుంచి భారీ అప్‌డేట్ వచ్చేసింది. అభిమానులతోపాటు మొత్తం సినీ పరిశ్రమ వేచి చూసిన గ్లింప్స్ వీడియోను గ్లోబ్‌ట్రాటర్ గ్రాండ్ ఈవెంట్‌లో ఘనంగా విడుదల చేశారు. మూడు నిమిషాల నిడివితో వచ్చిన ఈ వీడియోలో చూపించిన విజువల్స్ ప్రపంచ స్థాయి మేధస్సు, విపరీతమైన స్కేలు చూపిస్తున్నాయి. గ్లింప్స్‌లో వారణాసి 512 CE, గ్రహశకలం శాంభవి 2027 CE, అంటార్కిటికా-ఆఫ్రికా, ఉగ్రభట్టి కేవల్, లంకా-త్రేతాయుగం, వారణాసి మణికర్ణిక ఘాట్ వంటి అనేక ప్రాంతాలు, యుగాలు చూపించారు. దీంతో ఈ చిత్రం ఒక్క జానర్‌కు పరిమితం కాదని స్పష్టమవుతోంది. టైమ్ ట్రావెల్, సైన్స్ ఫిక్షన్, మైథలాజీ, యాక్షన్ అడ్వేంచర్ అదుర్స్ అనిపించేలా గ్లింప్స్‌ను రూపొందించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తోన్న ఈ సినిమా రాజమౌళి కెరీర్‌లోనే అత్యంత పెద్దదిగా మారనున్నట్లు ఈ వీడియో చెబుతోంది. అత్యున్నత నాణ్యతతో చూపించిన వీఎఫ్ఎక్స్ గ్లింప్స్‌కు స్పెషల్ అట్రాక్షన్ అయింది. చివర్లో నందిపై కూర్చొని, చేతిలో త్రిశూలం పట్టుకుని రౌద్రంగా నిలిచిన మహేశ్‌బాబు లుక్ ఫ్యాన్స్‌ను షాక్‌కి గురి చేస్తోంది. సోషల్ మీడియాలో "ఈ సినిమాకు ఆకాశమే హద్దు" అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. చిత్రంలో మహేశ్ బాబు .. రుద్ర, ప్రపంచాన్ని చుట్టే సాహస యాత్రికుడు కాగా, ప్రియాంక చోప్రా - మందాకిని పాత్ర పోషించింది. పృథ్వీరాజ్ సుకుమారన్ - కుంభ, శక్తివంతమైన విరోధి పాత్ర పోషించాడు.



మరో కాంతార.. 'కొరగజ్జ'

గ్రామీణ సంస్కృతి, ఆచారాల నేపథ్యంలో సాగే కథతో తెరకెక్కిన కాంతార బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయిలో హిట్‌గా నిలిచిందో తెలిసిందే. కన్నడ నాట నుంచి పలు భాషల్లో విడుదలై పాన్ ఇండియా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇప్పుడు మళ్లీ అలాంటి టచ్ ఇస్తూ శాండల్‌వుడ్ నుంచి మరో సినిమా రాబోతుంది. అదే 'కొరగజ్జ'. కన్నడ, మలయాళం, హిందీ, తెలుగు, తమిళ్, తులు భాషల్లో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కబీర్ బేడీ కింగ్ ఆఫ్ ఉదయవరగా కనిపించబోతుండగా.. భవ్య, శృతి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇటీవలే విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. కాంతార సినిమాను గుర్తు చేస్తూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో లీడ్ క్యారెక్టర్ కొరగజ్జ థీమ్‌ను ప్రతిబింబించేలా సరికొత్త గెటప్‌లో కనిపిస్తూ.. కొరగజ్జ మరో కాంతార కాబోతుందని హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రానికి గోపీసుందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. ఈ మూవీలోని అన్ని పాటలను డైరెక్టర్ కమ్ రైటర్ సుధీర్ అత్తావర్ రాయడం విశేషం. కర్ణాటక తులునాడులో పూజింపబడే దైవం 'కొరగజ్జ' కథతో ఈ సినిమా రాబోతుంది. సుధీర్ అత్తవర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని త్రివిక్రమ్ సాఫల్య నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా కర్ణాటకలోని మంగళూరులో ఆడియో లాంచ్ చేశారని తెలిసిందే. 'కాంతార' తరహాలో గ్రామీణ సంస్కృతి, ఆచారాలు కలబోసిన దైవగాథ ఇదని, ప్రేక్షకుల్లో ఆధ్యాత్మిక భావాలు పెంపొందించేలా ఉంటుందని డైరెక్టర్ సుధీర్ అత్తావర్ క్లారిటీ కూడా ఇచ్చాడు.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200